

నేడైనా స్పందిస్తారా..?

- నత్తనడకన వ్యవసాయం
- సమస్యల వలయంలో జనం
- నేడు జడ్పీ పాలకమండలి సమావేశం
- లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిల ప్రమాణస్వీకారం



జిల్లా పరిషత్ కార్యాలయం

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజాపరిషత్ పాలకమండలి సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జడ్పీ మీటింగ్ హాలులో చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అధ్యక్షతన జరగనుంది. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలోని సమస్యలపై గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు. అయితే జనం సమస్యలపై స్పందించే దిశగా కాకుండా సర్వసభ్య సమావేశాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఒకప్పుడు పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా జడ్పీ సమావేశాలు సాగేవి. మౌలిక వసతులు సమకూరేవి. వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపడేవి. ఇప్పుడు అంతా మొక్కుబడి అయిపోతోంది.

జడ్పీ పాలకమండలి గత మూడు పర్యాయాలుగా వైసీపీ ఆధీనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుతం ఉన్న పాలకమండలి ఇప్పటి వరకు దాదాపు 16 జడ్పీ సర్వసభ్య సమావేశాలను నిర్వహించింది. ఒక్కొక్క సమావేశానికి సరాసరిన దాదాపు రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారే తప్ప ప్రజాసమస్యలకు పరిష్కారం చూపింది శూన్యం.

శాఖల వారీగా సమస్యలు..

- ఉమ్మడి జిల్లాలో ఎన్నడూ లేనంతగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అదును తప్పి వానలు పడుతున్నాయి. దీంతో మూడేళ్ల నుంచి వ్యవసాయం దారుణంగా దెబ్బతింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటి వరకు సరైన వర్షాలు లేకపోవడంతో సాగు నత్తనడకన సాగుతోంది. 1,88,520 ఎకాల సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు కేవలం 17,152 ఎకరాలలో మాత్రమే సాగైంది. తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు అంతంత మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కల్తీ విత్తనాలు, కల్తీ మందులతో పాటు యూరియా కొరత, అధిక ధరల చెల్లింపు తదితర సమస్యలు రైతులను వెంటాడుతున్నాయి.
- పశుసంవర్ధకశాఖలో పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని పశుపోషకులు వాపోతున్నారు. పశుగ్రాస విత్తన సరఫరా అంతంత మాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది.
- జిల్లాలో మొత్తం 2,389 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. వీటిలోచాలా వరకు అద్దె భవనాల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. బాల సంజీవని కిట్స్ పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.
- ఉమ్మడి జిల్లాలో 1929 ప్రభుత్వ పాఠశాలల్లో 1,10,751 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. చిన్నపాటి వర్షానికే పలు ప్రభుత్వ పాఠశాలలు ఉరుస్తున్నాయి. పలు పఠశాలల్లో ప్రహరీ గోడలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ఈ కారణంగా సీజనల్ వ్యాధులతో జనం సతమతమౌతున్నారు. వైద్య ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత వేధిస్తోంది. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో క్లాప్ మిత్రలు ఆందోళన చెందుతున్నారు. ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత మగ్గుతున్నారు. వీటన్నింటిపై చర్చసాగించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది.

నేడు లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిల ప్రమాణస్వీకారం

ఉమ్మడి కడప జిల్లాలో ఇటీవల నిర్వహించిన ఉప ఎన్నికల్లో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ సభ్యులుగా మారెడ్డి లతారెడ్డి, ముద్దుక్రిష్ణారెడ్డి గెలుపొందారు. వారు శనివారం నిర్వహిస్తున్న జడ్పీ సర్వ సభ్యసమావేశానికి మొదటిసారిగా హాజరవుతున్నారు. వారిని పాలకమండలికి పరిచయం చేయడంతో పాటు జడ్పీటీసీలుగా వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

నేతలపై జనం గంపెడాశ

నేటి జడ్పీ సర్వసభ్య సమావేశానికి జిల్లాలో నెలకొన్న సమస్యలపై శాఖలవారీగా సమస్త సమాచారాన్ని తీసుకురావాల్సిందిగా అధికారులకు ఇప్పటికే జడ్పీ సీఈవో ఆదేశాలు పంపారు. ఈ క్రమంలో ఏ యే శాఖలలో ఏ పనులు చేపట్టాలి.. ఎంతెంత నిధులు అందుబాటులో ఉన్నాయనే అంశాలపై చర్చించడంతో పాటు సమస్యలపై గళంవిప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు.

రూ.65 లక్షలు స్వాహా

- ఆర్టీసీ పెట్రోల్‌బంకులో వెలుగుచూసిన అవినీతి



రాజంపేటటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాజంపేట ఆర్టీసీ పెట్రోల్‌బంకులో అవినీతి వెలుగు చూసింది. పట్టణంలో ఆర్టీసీ నిర్వహణలో ఇండియన్ పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. ఈ నిర్వహణ బాధ్యతను 9 నెలల కిందట నంద్యాలకు చెందిన కాంట్రాక్టర్ ఎ.చంద్రమోహన్‌కు అప్పజెప్పారు. ఈ నేపథ్యంలో రూ.65 లక్షలు దుర్వినియోగమైనట్లు ఆర్టీసీ డీపీటీవో రాములు గుర్తించారు. దీనిపై విచారణ చేసి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పట్టణ సీఐ నాగార్జున, ఆర్టీసీ పెట్రోల్ బంకు నిర్వహణ అధికారులు డిపో క్లర్కు పీఆర్ నాయుడు, అసిస్టెంట్ క్లర్క్ పీఎల్ నరసారెడ్డితో పాటు 29 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి దోషులను గుర్తిస్తామని సీఐ తెలిపారు.

అనంతపురం ఎఫెక్ట్..! సగానికి తగ్గిన టమోటా ధరలు

- తిరోగమనంలో మదనపల్లె మార్కెట్
- లబోదిబోమంటున్నరైతులు 6

రాజంపేట పూర్వ ఆర్డీఓపై విచారణ

6
- ఇప్పటికే సస్పెన్షన్‌లో వున్న కోదండరామిరెడ్డి
- విచారణాధికారిగా జేసీ ఆదర్శ రాజేంద్రన్ నియామకం

డ్రైవర్‌కు నాలుగున్నరేళ్లు జైలు 6

ఆన్‌లైన్ గేమ్ ఆడితే.. కటకటాలే..

- కేంద్రం కన్నెర్ర
- నిషేధిస్తూ.. పార్లమెంటులో బిల్లు పాస్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఏటా లక్షల మంది ప్రాణాలను బలి తీసుకుంటున్న ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపైన కేంద్రం కొరడా ఝుళిపించింది. బెట్టింగ్‌లను నేరంగా పరిగణించింది. ఇక ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడినా.. ఆన్‌లైన్ గేములు నిర్వహించినా.. వాటికి ప్రచారకర్తలుగా ఉన్నా.. జైలుశిక్ష పడేలా బిల్లు తీసుకొచ్చింది. గత వారంలో ప్రధాని మోదీ నేతృత్వంలో పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టింది. ఈ బిల్లు పాస్ కావడంతో పాటు రాష్ట్రపతి ఆమోదముద్ర కూడా పడింది. దీంతో ఇక ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ముకుతాడు పడినట్లే అని ప్రజలు భావిస్తున్నారు.

- తంబళ్లపల్లె మండలం కొటాల పంచాయతీకి చెందిన ఓ టెంపో డ్రైవర్ గత డిసెంబరులో ఆన్‌లైన్ గేములు ఆడి సుమారు రూ.15 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ అప్పులు తీర్చే దారిలేక అప్పులు ఇచ్చిన వాళ్లకు సమాధానం చెప్పలేక.. ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. ఇదే మండలం దిగువ గాలిగుట్టపల్లెకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటు పడి.. సుమారు రూ.20 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ అప్పులు తీర్చేదారి లేక గత ఏడాది అక్టోబరులో సీటీఎం వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.
- వాల్మీకిపురంలో ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్న గుర్రంకొండ మండలం తరిగొండ పంచాయతీకి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటుపడి లక్షల రూపాయలు అప్పులపాలయ్యాడు. చివరకు భార్య బంగారు నగలను కూడా తాకట్టు పెట్టి బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. దీంతో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగి పంచాయతీ స్టేషన్‌కు చేరింది.

ఆండ్రాయిడ్ ఫోన్‌లు ప్రజల చేతుల్లోకి విరివిగా వచ్చేసి ఫోన్‌లోనే అన్ని రకాల బెట్టింగ్‌లు ఆడడం అతి సులువుగా మారింది. వేల కుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టి.. నడివీధికి ఈడుస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ బెట్టింగ్ యాప్‌లపైన కొరడా ఝుళిపించింది. దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించింది. ప్రస్తుతం మార్కెట్‌లో వందలాది బెట్టింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ గేమింగ్ యాప్‌లు ప్రజలకు అందుబాటులోకి వచ్చేశాయి. దీంతో పలువురు ఈ యాప్‌ల ద్వారా దేశ, విదేశాల నుంచి అతి సులువుగా ఫోన్‌లోనే ఆన్‌లైన్ బెట్టింగ్ కొనసాగిస్తున్నారు. గతంలో క్రికెట్‌లో ఎక్కువగా బెట్టింగ్ జరిగేది. ప్రస్తుతం హాకీ, ఫుట్‌బాల్ ఇలా అన్ని రకాల ఆటల్లోకి ఆన్‌లైన్ బెట్టింగ్ చొరబడింది. వీటితో పాటు రమ్మీ వంటి జూదం ఆడేందుకు కూడా యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.



ఉచ్చులో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

ఈ ఆన్‌లైన్ గేమ్ బారిన విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కూలీలు, ఉద్యోగులు, చివరికి రైతులు సైతం పడుతున్నారు. కాయకష్టం చేసి సంపాదించుకున్న డబ్బంతా ఆన్‌లైన్ గేములలో పోగొట్టుకుంటున్నారు. ఎందరో విద్యార్థులు పరీక్ష ఫీజుల కోసమని ఇచ్చిన డబ్బును సైతం బెట్టింగ్‌లో పోగొట్టుకుంటున్నారు. నెలకు లక్షల రూపాయలు జీతం తీసుకుంటున్న సాఫ్‌వేర్ ఉద్యోగులు.. తమ జీతాలే కాకుండా.. బయట అప్పులు చేసి మరీ బెట్టింగ్ ఆడుతున్నారు. సమాజాన్ని ఎంతో కొంత ప్రభావితం చేసే సినీ, క్రీడా ప్రముఖులు ఈ ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లకు ప్రచారకర్తలుగా ఉన్నారు. దీంతో ఎక్కువ మంది ఈ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

ఏటా రూ.8.39 లక్షల కోట్ల అక్రమ బెట్టింగ్‌లు

వివిధ అధ్యయనాల ప్రకారం దేశీయంగా ఏడాదికి రూ.8.39 లక్షల కోట్ల మేరకు అక్రమ బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జూద క్రీడల్లో నిత్యం డబ్బులు గుమ్మరిస్తున్న భారతీయులు 14 కోట్ల మంది వరకు ఉన్నట్లు సమాచారం. ఐపీఎల్ సమయంలో ఇది సుమారు 37 కోట్ల వరకు ఉంటోంది. మొదట్లో పట్టణాలకే పరిమితమైన ఈ బూతం ప్రసుత్తం దేశవ్యాప్తంగా పల్లెలకూ విస్తరించింది. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు స్వామివారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజు, కృష్ణప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, టీడీపీ ఇన్‌చార్జి చమర్తి తదితరులు

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెప్టెంబరు 1న రాజంపేటకు వస్తున్న సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఈ మేరకు కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాద్ హెగ్డే, టీడీపీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్ రాజు, సీఎంవో అధికారుల ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. హెలిప్యాడ్, సభాస్థలి ఏర్పాట్లు, టీడీపీ కార్యకర్తల సమావేశం, పెన్షన్‌దారులతో స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి మాట్లాడే కార్యక్రమ ఏర్పాట్లను చేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్ విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సెప్టెంబరు 1న రాజంపేట మండలం బోయనపల్లె గ్రామానికి పెన్షన్ల పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా వస్తున్నారని ఈ మేరకు జిల్లా అధికారులతో సమన్వయ పరుచుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా సభాస్థలం, హెలీప్యాడ్ పెన్షన్‌దారులతో మాట్లాడటం, శాంతిభద్రతల అంశంపై భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్‌కలెక్టర్ భావన, రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్ మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

గండిక్షేత్రంలో హుండీల లెక్కింపు

- రూ.1.96 కోట్ల ఆదాయం



గండి క్షేత్రంలో హుండీ లెక్కింపు దృశ్యం

చక్రాయపేట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహిచామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. జూలై 25 నుంచి ఈనెల 23 వరకు గండి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు జరిగాయన్నారు. ఈ రోజులకు గాను హుండీల ఆదాయాన్ని లెక్కించామన్నారు. దేవదాయ శాఖ తనిఖీదారులు సి.శివయ్య పర్యవేక్షణలో, పోలీసు సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది సమక్షంలో హుండీల ఆదాయాన్ని లెక్కించామన్నారు. నగదు రూ.40,71,120, మిక్స్‌డు బంగారం 11 గ్రాములు, మిక్స్‌డు వెండి 900 గ్రాములు, అరబ్ దిర్హామ్స్ 10 వచ్చాయన్నారు. మొత్తం రూ.1,96,07,865 ఆదాయం లభించిందన్నారు. ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు వర్తికేసరి, వర్తిరాజారమేశ్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు నూతన బార్లకు డ్రా

రాయచోటిటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏర్పాటు చేయనున్న 11 ఓపెన్ బార్లతో పాటు ఒక కల్లుగీత కార్మికులకు సంబంధించిన బార్‌కు శనివారం ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్ సమక్షంలో లాటరీ పద్ధతి ద్వారా డ్రా తీసి బార్లను కేటాయిస్తారని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 11 ఓపెన్ బార్లకు గానూ మదనపల్లెలో 3, రాయచోటిలో 2, రాజంపేటలో 2 బార్లకు, ఒక కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్‌కు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. సదరు ఓపెన్, కల్లుగీత వారికి కేటాయించిన బార్లకు కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో లాటరీ డ్రా ద్వారా కలెక్టర్ సమక్షంలో బార్లు కేటాయిస్తారని తెలియజేశారు. దరఖాస్తుదారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

'ప్రాథమిక' కష్టాలు పుట్టెడు..!

- అవస్థల్లో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు
- భారంగా మారిన అడ్మినిస్ట్రేషన్, తరగతుల బోధన

ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ కొత్త సంస్కరణలలో భాగంగా మోడల్ ప్రైమరీ స్కూల్ వ్యవస్థ ప్రవేశపెట్టింది. దీనిలో ప్రతి మోడల్ స్కూల్‌కు పీఎస్ హెచ్‌ఎం పోస్టు కేటాయించారు. మొన్న జరిగిన బదిలీల్లో ఆ పోస్టులను భర్తీ కూడా చేశారు. అయితే హెచ్‌ఎం ఒక్కరు మాత్రమే ఉన్న పాఠశాలలో పూర్తిభారం వారిపైనే పడడంతో ఒకపక్క అడ్మినిస్ట్రేషన్ మరోపక్క తరగతులు బోధన కష్టసాధ్యంగా మారిందంటున్నారు. దీంతో బోధన కుంటుపడి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందని అంటున్నారు.

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త పాఠశాలలకు 4,706 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పీఎస్ హెచ్‌ఎంలుగా విద్యాశాఖ కన్వర్షన్ చేసింది. ఉమ్మడి కడప జిల్లాకు 291 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు కేటాయించింది. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వు 21 ప్రకారం 1 నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతున్న ఉన్నత పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య 31 దాటిన చోట ఒక పీఎస్ హెచ్‌ఎంతో పాటు ముగ్గురు ఎస్జీటీ పోస్టులు మంజూరు చేశారు. 45 మంది విద్యార్థులు దాటిన ప్రతి పాఠశాలను మోడల్ ప్రైమరీగా మార్చి పీఎస్ హెచ్‌ఎం పోస్టును సృష్టించారు. విద్యార్థులు 59 వరకు ఒక పీఎస్ హెచ్‌ఎం, ముగ్గురు ఎస్జీటీలు, 60 నుంచి ఒక పీఎస్ హెచ్‌ఎం, నాలుగు ఎస్జీటీలు మంజూరు చేశారు. దీని మేరకే తాజాగా జరిగిన బదిలీలలో ఖాళీలు చూపించారు. అయితే ప్రభుత్వం ఎన్నడూ లేనివిధంగా స్కూల్ అసిస్టెంట్లను పీఎస్ హెచ్‌ఎంలుగా పంపింది. వీరు జూన్ 9న తమ విధుల్లో చేరారు. అక్కడి నుంచి వారికి కష్టాలు మొదలైనట్లు తెలుస్తోంది. అడ్మినిస్ట్రేషన్‌తో పాటు తరగతుల బోధన పెనుభారంగా మారిందని వాపోతున్నారు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్లు, నాన్ లాంగ్వేజ్ పాఠ్యాంశాలు బోధించాల్సి వస్తోంది. దీనితో పాటు మోడల్ ప్రైమరీలకు కేటాయించిన ఎస్జీటీలు అన్నీ భర్తీకాక, భర్తీ అయినా రిలీవర్ లేక సిబ్బంది కొరత వేధిస్తోంది. తల్లికి వందనం, ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాల వల్ల ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల సంఖ్య పెంచాలంటూ పీఎస్ హెచ్‌ఎంలపై కొన్నిచోట్ల ఒత్తిడి పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

వందమందికి ఒక్కరే..

- రాయచోటిలోని ఓ ప్రభుత్వ యాజమాన్య మోడల్ ప్రైమరీ పాఠశాలలో వంద మందికి పైగా విద్యార్థులు ఉన్నా అక్కడ కేవలం ఒక పీఎస్ హెచ్‌ఎం మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా నలుగురు ఎస్జీటీలు అవసరం ఉన్నా భర్తీ కాలేదు. దీనితో వంద మందికి ఒక్కరే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- గోపవరం మండలం కాల్వపల్లె ఉన్నత పాఠశాలలోని ప్రాథమిక పాఠశాలలో కేవలం ఒక పీఎస్ హెచ్‌ఎం మాత్రమే పనిచేస్తున్నారు. ఎస్జీటీల నియామకం కాలేదు. ఐదు తరగతులకు ఒక్కరే దిక్కయ్యారు. బోధనా సిబ్బంది కొరత వల్ల అక్కడ ఉన్న విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది.

కుంటుపడుతున్న బోధన

కొన్నిచోట్ల పీఎస్ హెచ్‌ఎం కూడా 1 నుంచి 5వ తరగతి వరకు కచ్చితంగా అన్ని సబ్జెక్టులు చెప్పాలని కొంతమంది ఎంఈఓలు నిర్దేశం చేస్తున్నారు. దీనితో అడ్మినిస్ట్రేషన్‌తో పాటు పీఎస్ హెచ్‌ఎంలు బోధన మీద దృష్టి పెట్టడం అసాధ్యంగా మారుతోంది. దీనితో 5వ తరగతి విద్యార్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. మరికొన్ని చోట్ల పీఎస్ హెచ్‌ఎంలుగా ఉన్న హిందీ, తెలుగు స్కూల్ అసిస్టెంట్లు సైన్స్, గణితం బోధంచడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలా అనేక రకాల సమస్యలతో మోడల్ ప్రైమరీ పాఠశాలు కొట్టుమిట్టాడుతున్నాయి. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఖాళీలన్నీ భర్తీ చేయాలని పలువురు ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు. దీనిపై కడప డీఈవో షంషుద్దీన్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తుందన్నారు.



మోడల్ ప్రైమరీ స్కూల్ (మైదుకూరు)

బస్సు బైక్ ఢీ - రైతు దుర్మరణం

తంబళ్లపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు-బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో రైతు శ్రీనివాసులరెడ్డి (50) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు తంబళ్లపల్లె మండలం రెడ్డికోట పంచాయతీ కొప్పలవారిపల్లె వాసి శ్రీనివాసులరెడ్డి సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో కోటకొండకు వస్తుండగా మార్గమధ్యలో గుండాలవంక మలుపు వద్ద ఆర్టీసీ బస్సు- బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న రైతు శ్రీనివాసులరెడ్డిని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


రామ్లానాయక్ (ఫైల్‌ఫొటో)

సుండుపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని మాచిరెడ్డిగారి పల్లె పంచాయతీ చిన్నబిడికికి చెందిన రామ్లానాయక్ (70) గురువారం తెల్ల వారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం పింఛా నది సమీపం లోని నీటి గుంతలో అతని మృతదేహాన్ని బాటసారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని వెలికి తీయించి చిన్నబిడికీ వాసిగా గుర్తించామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి కాగితి నరేష్ (40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలకడ మార్గంలోని అంకాలమ్మ గుడి సమీపంలోని ఉమ్మనగుంట చెరువులోకి దిగాడు. పట్టుతప్పి నీళ్లలోకి పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఏఎస్‌ఐ మహబూబ్ సాహెబ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

నిమ్మనపల్లి ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ దాసరిపేట వాసి తుపాకుల రోహిత్ కుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాల్లోకెళ్తే.. దాసరిపేటలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు గురువారం రాత్రి హిజ్రాలతో అసభ్యకర డ్యాన్సులు వేసేందుకు ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో గురువారం కమిటీ సభ్యులు ప్రసన్న కుమార్, కొండప్ప, హేమంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా వీరివెంటే వెళ్లిన సదరు గ్రామానికి చెందిన రోహిత్‌కుమార్ స్టేషన్‌లో గందరగోళం సృష్టించి పోలీసులను దుర్భాషలాడి దాడికి యత్నించినట్లు ఎస్‌ఐ తెలిపారు. దీంతో కానిస్టేబుల్ హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండు విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు

మరో మూడు నెలల పొడిగింపు

రాయచోటి(నేతాజీసర్కిల్)/కడప కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాలపరిమితిని మరో మూడు నెలలపాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు సెప్టెంబరు 1, నుంచి నవంబరు 30 వరకు, నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.

డ్రైవర్‌కు నాలుగున్నరేళ్లు జైలు


డ్రైవర్‌తో కోర్టు కానిస్టేబుల్

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును ఢీకొని ఆరుగురి మృతికి కారణమైన కేసులో సిమెంటు ట్యాంకర్ డ్రైవర్‌కు నాలుగున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజంపేట 3వ అదనపు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. 2023 జూలై 20న డ్రైవర్ మహదేవ మద్యం మత్తులో సిమెంటు ట్యాంకర్‌తో ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా 29 మందికి గాయాలయ్యాయి. అప్పటి ఓబులవారిపల్లె ఎస్‌ఐ బి.శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. రాజంపేట ఇన్‌చార్జి సీఐ నరసింహారావు, అనంతరం డీఎస్పీ వీఎన్‌కే చైతన్య దర్యాప్తు చేసి కోర్టుకు చార్జిషీటు సమర్పించారు. 56 మంది సాక్షులను విచారణ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిజాంజానీ, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, కోడూరు రూరల్ సీఐ పి.వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ పి.మహేష్, సాక్షులను సమయానికి కోర్టులో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ (862) వెంకటరమణలను ఎస్పీ అభినందించారు.

అనంతపురం ఎఫెక్ట్..!

● తిరోగమనంలో మదనపల్లె మార్కెట్

● లబోదిబోమంటున్న రైతులు

సగానికి తగ్గిన టమోటా ధరలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు అనంతపురం టమోటా మార్కెట్ దెబ్బతీస్తోంది. గత పది రోజులుగా మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న టమోటా 80 శాతం తగ్గిపోగా, ధరలు కూడా సగానికి సగం తగ్గిపోయాయి. దీంతో రైతులు బేర్ మంటున్నారు. నిత్యం 1500 టన్నుల టమోటా విక్రయానికి వస్తున్న పరిస్థితి నుంచి నేడు కేవలం నిత్యం 90 టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి వస్తుండటం చూస్తే మదనపల్లె మార్కెట్ ఎంత అధ్వాన స్థితికి దిగజారిందో.. తద్వారా మార్కెట్ వార్షిక ఆదాయంపై పెద్ద దెబ్బపడుతోంది.





మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమోటా, (ఇన్‌సెట్లో) మార్కెట్ కమిటీ కార్యాలయం

మదనపల్లె మార్కెట్ దినదినం తిరోగమనం

దేశంలోనే అతి పెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె దినదిన ప్రవర్ధమానం కాకుండా దినదినం తిరోగమనంలోకి పడిపోతోంది. 11 ఎకరాల విస్తీర్ణం వున్న మార్కెట్ ఇరుకుగా మారిపోవడం, లారీ యూనియన్ల మధ్య సమ స్యలు, టమోటా లోడింగ్, అన్‌లోడింగ్, జాక్‌పాట్ విధానం, క్రేట్లకు బాడుగ తీయడం, ముఖ్యంగా ఉదయం మార్కెట్‌కు వచ్చిన రైతులకు టమోటా ట్రేడర్స్ సాయంత్రం వరకు టమోటా బిల్లులకు డబ్బులు చెల్లించకోవడం వెరసి మదనపల్లె మార్కెట్ దినదినం అథోగతి పాలవుతోంది. దీంతో టమోటా సీజన్ ముగియకనే ఇక్కడికి ప్రతిరోజు 1500 టన్నులు నుంచి నేడు 90 టన్నుల వరకు మాత్రమే విక్రయాలకు పడిపోయాయి. ఈ దెబ్బకు ఇక్కడి టమోటా ధరలు కూడా సగానికి సగం పడిపోతున్నాయి.

గత రెండు నెలలుగా మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు నిలకడగానే సాగాయి. కాని నాలుగు రోజులుగా ధరలు ఒక్కసారిగా సగానికి సగం పడిపోయాయి. గత జూన్, జూలై నెలలు, ఆగస్టు 22వ తేది వరకు మదనపల్లె మార్కెట్‌లో టమోటా గరిష్ఠంగా కిలో రూ.50 పలుకగా, కనిష్ఠగా కిలో రూ.20 పలికాయి. ఈ ధరలు పలికిన సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు కాస్త లాభాలు కళ్ల చూసారు. కాని ఆగస్టు 22వ తేది నుంచి మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా పతనం అవుతున్నాయి. గరిష్ఠ ధర కిలో రూ. 50 నుంచి రూ.44, రూ.36, రూ.26కు పడిపోయాయి. అలాగే కనిష్ఠ ధర కూడా కిలో రూ.20 నుంచి కిలో రూ.15 వరకు పడిపోయింది. అంతేకాకుండా జూన్ నెలలో ప్రతిరోజు మార్కెట్‌కు సరాసరిన 1500 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా, జూలైలో వెయ్యి మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి వచ్చింది. కాని జూలై 18వ తేది నుంచి మార్కెట్‌కు వచ్చే టమోటా గణనీయంగా తగ్గిపోతూ ప్రతి రోజు 500 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ఇదే ఆగస్టు నెల ప్రారంభంలో 300 టన్నులు రాగా నేడు కేవలం 96 మెట్రిక్ టన్నులకే టమోటా దిగుబడి పడిపోయింది.

అనంతపురం సీజన్ ఎఫెక్ట్...

అనంతపురం జిల్లాలో జూలై నెల నుంచి టమోటా దిగుబడి ప్రారంభమవుతుంది. ముఖ్యంగా వేడి వాతావరణం పోయి, వాతావరణం చల్లబడటం, వర్షాలు పడుతుండటంతో అక్కడి టమోటా తోటల్లో దిగుబడి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో వ్యాపారులు కూడా మదనపల్లె మార్కెట్‌ను వదిలేసి అనంతపురం మార్కెట్‌కు పోలోమంటూ వెళ్లిపోయారు. ఇది కూడా మదనపల్లె మార్కెట్‌లో ధరలు పడిపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ సీజన్ ముగుస్తుండడంతో టమోటా నాణ్యత కూడా తగ్గిపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. అంతేకాకుండా మదనపల్లె మార్కెట్‌తో పోలిస్తే ములకలచెరువు, అంగళ్లు, గుర్రంకొండ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చే టమోటాలకు మంచి ధరలు వస్తుండటంతో రైతులు ఈ మార్కెట్‌లకే ప్రాధాన్యత ఇస్తూ మదనపల్లె మార్కెట్‌ను తిరస్కరిస్తున్నారు. దీంతో దేశంలో అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరుపొందిన మదనపల్లె మార్కెట్ తిరోగమనంలో పడిపోతోంది. మదనపల్లె టమోటా మార్కెట్‌కు గతంలో మార్కెట్ సెస్సు కింద వసూలు చేయడం, మండీల అద్దెలు, మార్కెట్‌లో షాపింగ్ గదుల అద్దె కలిపి వార్షిక ఆదాయం రూ.3కోట్లకు పైగా వచ్చేది. భవిష్యత్‌లో పై తెలిపిన పరిస్థితులు కొనసాగితే మదనపల్లె మార్కెట్ వార్షిక ఆదాయం గణనీయంగా పడిపోయి, సగానికి సగం తగ్గిపోయినా ఆశ్చర్యపడనవసరం లేదని విశ్లేషకుల అభిప్రాయం. ఇకనైనా జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లె మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాల్సి వుంది.

రాజంపేట పూర్వ ఆర్డీఓపై విచారణ

● కోర్టు కేసుల్లో ప్రభుత్వానికి చిక్కులు

● ఇప్పటికే సస్పెన్షన్‌లో వున్న కోదండరామిరెడ్డి

● విచారణాధికారిగా జేసీ ఆదర్శ రాజేంద్రన్

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పూర్వ ఆర్డీఓ, ప్రస్తుతం తిరుపతి గాలేరు నగరి యూనిట్-1 ఎస్‌డీసీ డి.కోదండరామిరెడ్డిపై విచారణకు ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. విచారణాధికారిగా అన్నమయ్య జిల్లా జేసీ ఆదర్శ రాజేంద్రన్‌ను, ప్రెజెంటింగ్ అధికారిగా డీఆర్‌ఓ కె.మధుసూదనరావును నియమించింది. రెండు నెలల్లోగా విచారణ ముగించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాజంపేట ఆర్డీఓగా, జీఎన్‌ఎస్ఎస్ భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వహించే సమయంలో ఒక కోర్టు కేసులో అనాలోచితంగా వ్యవహరించి తీవ్ర తప్పిదాలకు పాల్పడడంతో ప్రభుత్వానికి కోర్టులో ఇబ్బందులెదురయ్యాయి. చాలా రోజుల విచారణ అనంతరం గతేడాది ఆగస్టు 30న ప్రభుత్వం కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేసింది. అనంతరం ఆయన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో డిసెంబరు 13న ఆయనపై ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసి నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలు ఇలా వున్నాయి.

సోమశిల ప్రాజెక్టు కింద 54 ముంపు గ్రామాలకు పునరావాసం, పరిహారాల చెల్లింపులపై ఆ గ్రామాల తరఫున కె.నాగిరెడ్డి 2022లో హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు కారణంగా సోమశిల ఫేజ్-2లో ముందుకెళ్లడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. అయితే జీఓ నెం.68 ప్రకారం, కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారాల చెల్లింపులు సాధ్యపడదని, అది ప్రభుత్వ ఖజానాపై తీవ్ర భారం పడుతుందని కోదండరామిరెడ్డి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. వాస్తవానికి ఈ కేసులో ఈయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, కడప భూసేకరణ ఆర్డీఓలు ప్రతివాదులుగా వున్నారు. అయితే వీళ్లలో ఎవరి ప్రమేయం లేకుండానే అందరి తరఫున కోదండరామిరెడ్డి జీఓ 68ని ఉటంకిస్తూ కౌంటర్ దాఖలు చేశారు. చివరికి తేలిందేమిటంటే అసలు జీఓ68 సోమశిల ముంపు ప్రాంత రైతులకు సంబంధించినది కాకపోవడం. అంతేగాకుండా 54 ముంపు గ్రామాల్లో 25 గ్రామాలు మాత్రమే రాజంపేట యూనిట్ పరిధిలోకి అంటే కోదండరామిరెడ్డికి సంబంధించినవి మాత్రమే. మిగిలిన 29 గ్రామాలు కడప భూసేకరణ విభాగానికి సంబంధించినవి. ఇదిలా వుండగా ఉన్నతాధికారులతో సంప్రదించకుండానే కోదండరామిరెడ్డి జీఓ 68ని తెరపైకి తెచ్చి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ప్రభుత్వానికి చిక్కులెదురయ్యాయి. దీని కారణంగా సోమశిల ఫేజ్-2 ముందుకెళ్లడానికి అడ్డంకులేర్పడ్డాయి. ఈ విషయంపై పూర్తి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

● అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

● విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్

పీలేరురూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కడప విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్ హెచ్చరించారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో కడప విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను క్యాష్ చేసుకోవాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పీలేరులో యూరియా కొరత ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండుమూడు రోజుల్లో యూరియా రైతుల అవసరాల మేరకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వ్యాపారులు ఎక్కువ ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా సెక్షన్ 6(ఏ) ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్ని రకాల ఎరువులు విక్రయిస్తున్నారు. వాటి ధర, స్టాకు వివరాలు విధిగా నోటీస్ బోర్డులో ఎంటర్ చేయాలని చెప్పారు. రైతులు తీసుకునే ఎరువులు, విత్తనాలకు సంబంధించి విధిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఏవో రమాదేవి మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా వచ్చిన యూరియాను ఎప్పటికప్పుడు రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తామని చెప్పారు. పీలేరులో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఎక్కడా యూరియా లేదని తెలిపారు. విజిలెన్స్ అధికారులు పట్టణంలోని కిసాన్, అగ్రిక్లీనిక్, మారుతి ఫెర్టిలైజర్స్, సురేంద్రరెడ్డి షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాకు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎరువుల గోడౌన్లలో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు.


గోడౌన్‌లో ఎరువులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెలుగును నిర్బంధం చేయాలి

● అవధాని లోకజగన్నాథశాస్త్రి


సభలో మాట్లాడుతున్న అవధాని లోకజగన్నాథశాస్త్రి

కలకడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని నిర్బంధం చేసే దిశగా చట్టంలో మార్పులు తేవాలని అవధాని లోకజగన్నాథశాస్త్రి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాష మనుగడకు వ్యవహర్తలే మూలమన్నారు. కడపకు చెందిన రంగస్థల కళాకారుడు మధుబాబు తెలుగు భాషా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తన రాగాలాపనతో కార్యక్రమాన్ని రంజింపచేశారు. క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాయామ ఉపాధ్యాయుడు మురళీ హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ దేశఖ్యాతిని ప్రపంచస్థాయిలో తెలియజేశాడని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని కోరారు. అంతకుమునుపు హెచ్ఎం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలోని కవుల శిలావిగ్రహాలు, గిడుగు రామ్మూర్తిపంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులు, ఆకృతిగా ఏర్పడి తెలుగుభాషపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, మధు, శ్రీరాములనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణ పడిన ఇరువర్గాలు అదుపులోకి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీటీఎంలో గురువారం రాత్రి రెడ్డిశేఖర్, చిన్నరెడ్డెప్ప ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. రాత్రి సదుమనిగిన గొడవ శుక్రవారం ఉదయాన్నే రెడ్డిశేఖర్‌కు చెందిన వారు సుమారు 20 మంది సీటీఎంలోని చిన్నరెడ్డప్పకు సంబంధించిన వారి ఇళ్లపై దాడి చేశారు. వారు వెంటనే తాలుకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను పిలిపించి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు వీధిరౌడీలుగా ఇళ్లపై దౌర్జన్యం చేసిన రెడ్డి శేఖర్ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ విషయంలో ఇరువర్గాలను విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు తిరుపతి-కాచిగూడకు ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మధ్య కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును శనివారం నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు శనివారం రాత్రి 9.10గంటలకు తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప మీదుగా 31వ తేదీ సోమవరం ఉదయం 11గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ లక్ష్యం

● ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న


సోంపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న

ములకలచెరువు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి గానూ 14వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని సోంపల్లెలో శుక్రవారం డ్రిప్ పరికరాల నిర్వహణ, నీటి ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ములకలచెరువులలో శుక్రవాం పొలాల్లో అమర్చిన డ్రిప్‌ను పరిశీలించారు. అనంతరం ములకలచెరువులోని రైతు సేవా కేంద్రంలో ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మైక్రో ఇరిగేషన్ రిజిస్ట్రేషన్, ప్రాథమిక సర్వే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 10577 మంది రైతులు 12,711.71 హెక్టార్లలో ఆన్‌లైన్ ద్వారా డ్రిప్ పరికరాలకు నమోదు చేసుకున్నారన్నారు. ఐదు ఎరకాలలోపు విస్తీర్ణం కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తున్నామన్నారు. అలాగే 10 ఎకరాల లోపల విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 90శాతం రాయితీ, 10 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రైతుసేవా కేంద్రాల సిబ్బంది తన పరిధిలోని నీటి వసతి కలిగిన రైతులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించి ప్రాథమిక సర్వేలు చేపట్టి అంచాలు పూర్తి చేయాలన్నారు. రాయితీ పోయి రైతులు చెల్లించాల్సిన వాటాను ఈజీ పే ద్వారానే చెల్లించేలా చూడాలన్నారు. ఎవరు కూడా రైతుల నుంచి నగదు రూపంలో తీసుకోరాదన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ఉద్యానవనశాఖాధికారి భీమేష్, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐఈ కృష్ణానాయక్, ఎంఏవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.

4న 5కే రెడ్ రన్ మారథాన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ సంస్థ సంయుక్తంగా యువతకు నిర్వహిస్తున్న 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమంపై డీఎంహెచ్‌వో డాక్టర్ కే. లక్ష్మీనరసయ్య గురువారం తన ఛాంబర్‌లో జిల్లాలోని అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌వో రమేశ్‌బాబు మాట్లాడుతూ సెప్టెంబరు 4వ తేదీ ఉదయం 5.30 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమయ్యే ఈ రన్ నారాయణరెడ్డి పల్లె వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని తిరిగి కళాశాల వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న 17 నుంచి 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. పరుషులకు, మహిళలకు, ట్రాన్స్‌జెండర్‌లకు వేరు వేరుగా మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. తెలిపారు. ఔత్సాహికులు అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని ఎన్ఎస్ఎస్ అధికారుల ద్వారా గూగుల్ ఫారం లింక్ ద్వారా తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఇతర వివరాలకు మస్తాన్ క్రీడాశాఖ అధికారి 7386901200 పీవీ ప్రసాద్, జిల్లా సూపర్‌వైజర్ 9959550368 వెంకటరావు, పీవీ విశ్వప్రసాద్ ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్స్ (9490782453, 9502374642), ప్రాజెక్టు మేనేజర్ టీ. స్వాతి 7569166129లను సంప్రదించాలని జిల్లా అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) అధికారి ఎం. రాంమోహన్‌రెడ్డి, గుర్రప్ప, జిల్లా క్రీడాశాఖాధికారి మస్తాన్, గౌస్‌బాషా, జిల్లా నెహ్రూ యువ కేంద్ర మై భారత్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఇంటర్ విద్యాశాఖ డీఐఈవో రవి, జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వెంకటరావు, విశ్వప్రసాద్, క్లస్టర్ ప్రోగ్రాంమేనేజర్ వీ. భాస్కర్, క్రీడాశాఖ కోచ్ శ్రీనివాసరాజు, డీఏపీసీయూ, పీసీఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శతకవుల చిత్రాల ప్రదర్శన

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సంబేపల్లె ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం వంద మంది శతకవుల చిత్రాల ప్రదర్శనతో తెలుగు తల్లికి నీరాజనాలు అర్పించారు. విద్యార్థుల తెలుగు పద్యాలు, పాటల ఆలాపన, సంప్రదాయ నృత్యాల ప్రదర్శన అలరించింది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పీడీ షామీర్ నేతృత్వంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


100 మంది కవుల చిత్రాలతో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ఆందోళన వద్దు...

● అప్పీల్ చేసుకున్న వారికి యథావిధిగా వికలత్వపు పింఛన్ల పంపిణీ ● జిల్లాలో 6వేల మందికి ప్రయోజనం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వికలాంగుల పింఛన్లలో అనర్హులను తొలగించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఏపీలో పెన్షన్లపై గత కొన్ని రోజులుగా రాజకీయంగా చర్చ సాగుతోంది. ఇప్పటికే అర్హత లేనివారు పెన్షన్లు పొందుతున్న ట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు గుర్తించారు. దీంతో పెన్షన్ల తొలగింపుపై కొందరికి నోటీసులు జారీ చేశారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల అర్హులైన వారు నష్టపోయే పరిస్థితి ఉంటే తిరిగి పునఃపరిశీలన కోసం నోటీసు అందిన 30 రోజుల్లోపు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం అందిస్తే వికలాంగులకు ఉన్న వికలత్వపు శాతంపై వైద్య బృందంపై స్పష్టత ఇవ్వనుంది. ఈక్రమంలో నిజమైన అర్హులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుందనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇదిలా ఉండగా అనర్హులుగా నోటీసులు అందుకున్న వారు అధికారులకు తమ అప్పీల్ సమర్పిస్తున్నారు. ఇలాంటి వారందరికీ వికలత్వం పునఃపరిశీలన పూర్తయ్యేంత వరకు పింఛన్లను యదావిధిగా కొనసాగించనున్నారు.

అయినా.... ఆందోళన

వికలాంగుల పింఛన్ రద్దుపై రాజకీయంగా విమర్శలు మొదలయ్యాయి. కొంతమంది గందరగోళం సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఎవరైతే అప్పీలు సమర్పించుకున్నారో వారికి మాత్రం సెప్టెంబరు 1న పింఛను పంపిణీ యదావిధిగా చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వినతి సమర్పించిన దివ్యాంగులందరికీ సెప్టెంబరులో యదావిధిగా పెన్షన్లు అందుతాయన్నది స్పష్టమవుతుంది. దీనిపై ఎవ రూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి ఇటీవల సదరం సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్ చేశారు. అందులో 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి సెప్టెంబరు నుంచి పెన్షన్ నిలిపేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ పెన్షన్ కోత ఉండదని ప్రభుత్వం అభిప్రాయం. అందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వికలత్వం పునఃపరిశీలన పూర్తయిన తరు వాత అప్పీళ్లకు వెళ్లిన వారికి వారి వికలత్వం శాతం బట్టి పెన్షన్ అమలు చేయనున్నారు.

జిల్లాలో 6వేల మందికి ఉపశమనం

జిల్లాలో రద్దయిన వికలత్వపు పింఛన్లలో సుమారు 6వేల మందికి ఉపశమనం కలగనుంది. ఆన్‌లైన్ ప్రాంతాల్లో వినతులు సమర్పించడానికి 30న సాయంత్రం 5గంటలకు అనుమ తించనున్నారు. ఆఫ్‌లైన్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు వినతులు స్వీకరించడానికి గడువు విధించారు. ఈ క్రమంలో జిల్లాలో వినతులు సమర్పించిన వారి వివరాలిలా...

అట్లూరు మండలంలో 65 దివ్యాంగ పింఛన్లు తొలగించగా 56 మంది అప్పీలు చేసుకున్నారు. అదే విధంగా బి.కోడూరులో 116 మందికి గాను 80 మంది, బద్వేలు మండలంలో 81 మందికి 78 మంది, బద్వేలు మున్సిపాలిటీ ఏరియాలో 113 మందికి 72 మంది అప్పీలు చేసుకున్నారు. గోపవరం మండలంలో 88 మందికి 72 మంది, కలసపాడు మండలంలో 115 మందికి 114, పోరుమామిళ్ల మండలంలో 117 మందికి 114, కాశినాయన మండలంలో 103 మందికి 71, జమ్మలమడుగు మండలంలో 83 మందికి 80, మున్సిపల్ ఏరియాలో 79 మందికి 79 మంది అప్పీలు చేసుకున్నారు. కొండాపురం మండలంలో 300 మందికి 273, ముద్దనూరు మండలంలో 294 మందికి 266, మైలవరం మండ లంలో 115 మందికి 113, పెద్దముడియం మండలంలో 163 మంది కి 152, ఎర్రగుంట్ల మండలంలో 105 మందికి 95, మున్సిపాలిటీ పరిధిలో 54 మందికి 58 మంది అప్పీలు చేసుకున్నారు.

కడప నగరపాలకపరిధిలో 538 మందికి 211, కొన్ని వికలత్వపు పింఛన్ల కింద ఓఏపీ కిందమార్పు చేశారు. అలాంటి వారికి కూడా వికలత్వ పింఛను కింద ఆన్‌లైనులో 629 మంది నమోదు చేసుకున్నారు. సిద్దవటం మండలంలో 45కు 32 మంది, ఒంటిమిట్ట మండలంలో 66కు 55 మంది, చెన్నూరు మండలంలో 99 మందికి 104, చింతకొమమదిన్నె మండలంలో 154 మందికి 149, కమలాపురం మండలంలో 227మందికి 211, పెండ్లిమర్రి మండలంలో 232 మందికి 50, వల్లూరు మండలంలో 78 మందికి 79, వీరపునాయునిపల్లె మండలంలో 166 మందికి 84 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అదే విధంగా బ్రహ్మంగారిమఠం 125మందికి 115, చాపాడు మండలం లో 210కి 102 మంది, దువ్వూరు మండలంలో 246కు 217 మంది, మైదుకూరు మండలంలో 126కు నలుగురు మాత్రమే ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నారు. మైదుకూరు మున్సిపాలిటీపరిధిలో 122కు గాను 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలో 176 మంది, మండల పరిధిలో 207 మందికి గాను 193 మంది, రాజుపాలెంలో 111 మందికి 91, పులివెందుల నియోజకవర్గం చక్రాయపేటలో 203కు 95 మంది, లింగాల మండలంలో 436 మందికి ఒకరు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. పులివెందుల మండలంలో 114కు గాను 91మంది, మున్సిపల్ పరిధిలో 322 మందికి 273, సింహాద్రిపురం మండలంలో 180 మందికి 273, తొండూరు మండలంలో 451 మందికి 313, వేంపల్లె మండలంలో 451మందికి 313, వేముల మండలంలో 154కు గాను 85 మంది మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకున్నారు. ఇందులో గతంలో వికలత్వపు పింఛను వచ్చే వారికి వయసురీత్యా అర్హత ఉన్న వారికి వృద్ధాప్య పింఛన్ల కిందకి మార్పు చేశారు. ఈ రకంగా జిల్లాలో 7,182 వికలత్వ పింఛన్లకు 1177 పింఛన్లను ఓఏపీ కిందికి మార్పు చేశారు. వీరందరు కూడా తమకు వికలత్వపు పింఛన్లు మంజూరు చేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. వృద్ధాప్య పింఛన్లు 4వేలు, వికలత్వపు పింఛన్లు 6వేలు ఇవ్వడంతో చాలా మంది వికలత్వపు పింఛన్లు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయం



ప్రభుత్వ ఆదేశాల వికలత్వపు పింఛన్లు కోల్పోయిన వారు తిరిగి అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించాం.. ఆ విధంగా అప్పీలు చేసుకున్న వారికి తిరిగి వారి వికలత్వపు శాతం నిర్ధారణ అయ్యేంత వరకు వికలాంగుల పింఛన్లే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అదే విధంగా వికలత్వపు పింఛను నుంచి వృద్ధాప్య పింఛన్లు పొందిన వారు కూడా తమకు వికలత్వపు పింఛన్లనే అమలు చేయాలంటూ దరఖాస్తులు చేసుకుంటున్నారు. వికలత్వపు పర్సంటేజీ పునః పరిశీలనలో వచ్చేశాతం బట్టి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

తేనెలొలుకు భాష తెలుగు

● పాఠ్యపుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మధుసూదన్‌రావు, షంషుద్దీన్, సుబ్రహ్మణ్యం తదితరులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తేనెలొలుకు భాష తెలుగు భాష అని పాఠ్యపుస్తకాల ప్రచురణాల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని యూటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో పాఠ్యపుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు నాంది పలికారని, వాడుక భాష రాత భాషగా ఉండాలని పరితపించిన మహానుభావుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు అన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల డీఈఓలు డాక్టర్ షేక్ షంషుద్దీన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం మాటాడుతూ మాతృభాష మాధుర్యం ఎనలేనిదని, ఉగ్గుపాలతో నేర్చుకున్న భాష ఎంతో ఉన్నతమైందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మహేష్‌బాబు, నరసింహరావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఆటో దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోను దొంగతనం కేసులో నిందితుని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వివరాలిలా.. కడప సిటీ ఎన్జీవో కాలనీకి చెందిన తుమ్మలూరు అనిల్ కుమార్ అనే వ్యక్తిపై గతంలో ఏడు క్రిమినల్ కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదయ్యాయి. చిన్నచౌకు పీఎస్, రైల్వేకోడూరు, తిరుపతి వెస్ట్, ఈస్ట్ పీఎస్‌లలో పలు ఆటోలు దొంగతనం చేసినట్లు కేసులు ఉన్నాయి. అలాగే చెన్నూరు పీఎస్, కడప వన్‌టౌన్ పీఎస్‌లో కూడా పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. ఆ మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం చిన్నచౌకు ఇన్‌స్పెక్టరు ఓబులేసు, సబ్ ఇన్‌స్పెక్టరు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి శుక్రవారం తాడిపత్రి- తిరుపతి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద నింది తుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

సన్‌సైడ్ విరిగిపడి ఆరుగురికి గాయాలు



జమ్మలమడుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట కొట్టాలపల్లెలో సన్‌సైడ్‌విరిగి పడి ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల మేరకు... శుక్రవారం సాయంత్రం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తుండగా మిద్దెపై కొందరు నిలబడి చూస్తున్నారు. ఆ సమయంలో ఉన్నట్లుండి సన్‌సైడ్ విరిగి కింద ఉన్న వారిపై పడటంతో గాయపడ్డారు. వెంటనే వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో వై.లక్ష్మీదేవి, పద్మావతి, వరలక్ష్మి, పూజారి లక్ష్మీదేవి, మైల గురు కుమార్, ఎం.గురివిరెడ్డితో పాటు మరి కొందరు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి మృతి

సీకేదిన్నె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో మద్దిమడుగు సుగాలిబిడికివద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్యే నాగయ్యానాయక్ (55) మృతి చెందాడు. సుగాలిబిడికి చెందిన బుక్యే నాగయ్యానాయక్, ఓబుళమ్మ భార్యాభర్తలు మేకలు మేపుకుని జీవిస్తుండేవారు. శుక్రవారం మేకలను మేపుకునేందుకు గువ్వల చెరువు ఘాట్‌పైకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి తోలుకుని వస్తుండగా బిడికి సమీపంలో కడపవైపు నుంచి రాయచోటివైపు వెళ్లే ట్రాన్స్‌పోర్టు లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు వారిని గుర్తించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా నాగయ్యానాయక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఓబులమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారి బంధువులు తెలిపారు. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కలసపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దమూర్తిపల్లె వద్ద శుక్రవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వెళ్తున్న మహిళ మెడలోని సరడును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. గ్రామానికి చెందిన పి.మల్లేశ్వరి కలసపాడు-పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని తనపొలం వద్ద పనులు చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ పరిశీలించి మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువు రానివారికి చదువు నేర్పించండి

● వయోజన విద్యా డీడీ వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ డీడీ వెంకటసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చదువురానివారికి చదువు నేర్పిస్తే.. వారికి మీరు ఎప్పటికీ గుర్తుండిపోతారని వయోజన విద్యాశాఖ డీడీ వెంకటసుబ్బారెడ్డి వలంటీర్లకు సూచించారు. జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యాశాఖ, మెప్మా ఆధ్వర్యంలో రీసోర్స్ పర్సన్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చదువు చాలా అవసరమన్నారు. ముఖ్యంగా మహిళలకు చదువు ఉంటే ఎదుటివారితో గౌరవంతో మాట్లాడమే కాక ధైర్యంతో పనులు విజయవంతంగా చేసుకువస్తారన్నారు. అనంతరం చదువు నేర్పించిన వలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందిస్తారన్నారు. సూపర్‌వైజర్ మహేశ్వర్‌రెడ్డి, మెప్మా అధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీఏవోలకు, సీసీలకు, ఉపాధి హామీ పథకంలోని టీఏ, పీఏలకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు చదువురాని స్త్రీ, పురుషులకు వలంటీర్లు చదువు నేర్పిస్తారని.. ప్రతిరోజు సాయంత్రం రోజు ఒక గంట చొప్పున చదువు నేర్చుకోవాలని వయోజన విద్యా డీడీ వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శివారెడ్డి సూచించారు. ఏపీఎం గురుకుమార్, ఉపాధి హామీ ఏపీవో పద్మారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మిదేవి, సునీత పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఆరోగ్యమాత తిరునాళ్ల పతాకావిష్కరణ



మేరీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

కడప కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగర రైల్వేస్టేషన్ సమీపంలో గల ఆరోగ్యమాత తిరునాళ్ల మహోత్సవాల పతాకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాష్ హాజరై పతాకావిష్కరణ గావించారు.

కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం మేరీమాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. తదుపరి శాంతి కోసం శాంతి కపోతాన్ని (పావురం) ఎగురవేశారు. అనంతరం దివ్య పూజా సమర్పించారు. తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరగాలని, ప్రజలందరూ శాంతి సమాధానాలతో వుండాలని ప్రార్థించారు.

దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు

కాశినాయన ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అక్కంపేట గ్రామంలో మురుకూటి పెంచల్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఐదుగురిపై శుక్రవారం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు... పెంచల్‌రెడ్డి తన సొంత పొలంలో సేద్యం చేసుకునేందుకు వెళుతుండగా అదేగ్రామానికి చెందిన మురుకూటి వెంకటసుబ్బారెడ్డి, చిన్నసుబ్బిరెడ్డి, రామాంజలి, నాగవేణి సుబ్బారెడ్డి తల్లి సీతమ్మ కలిసి అడ్డుకోవడంతో పాటు పెంచల్‌రెడ్డిని అసభ్య పద జాలంతో దూషించి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

వినాయకుని ఊరేగింపులో ఉద్రిక్తత... 144 సెక్షన్ అమలు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుసిబ్బంది

చెన్నూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో గురువారం రాత్రి వినాయకుడి ఊరేగింపు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తు న్నారు. వివరాలిలా... చెన్నూరు మండల కేంద్రంలో పలు వీధుల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా స్థానిక తూర్పు హరిజనవాడలో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి.. గురువారం రాత్రి ఊరేగింపు చేపపట్టగా.. అదే ప్రాంతంలోని కొందరు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. ఈ విషయాన్ని స్థానిక సీఐ కడప డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో ఐదుగురు సీఐలు, పలువురు ఎస్‌ఐలు పెద్దఎత్తున పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు చెన్నూరు పాత బస్టాండు కూడలిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా పరిస్థి తిని అదుపులో ఉంచేందుకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తూర్పు వీధిలోకి ముగ్గురికి మించి వెళ్లకుండా పోలీసు సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే తూర్పు హరిజనవాడ నుంచి బస్టాండు వరకు ఎవరినీ వెళ్లనీయ కుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా చెన్నూరులో వినాయకుని అన్న ప్రసాదం జరిగే ప్రాంతానికి తమను ఎందుకు వెళ్లనివ్వడం లేదంటూ తూర్పు హరిజనవాడ ప్రజలు స్థానిక సీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాత్రి ఊరేగింపు సందర్భంగా గొడవకు కారణమైన షబ్బీర్, అష్రఫ్, వారిష్, ఫకృద్దీన్, షఫి, తన్వీర్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని.. ఎవరైనా గొడవలకు పాల్పడితే సహించేది లేదని.. కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సీఐలు రామక్రిష్ణ, సుబ్బారావు, రోషన్‌తో పాటు పలువురు ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కడపలో సౌత్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 30వ తేదీ శని వారం నుంచి ఏసీఏ సౌత్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఇందులో కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంత పురం జిల్లాల క్రికెట్ జట్ల మధ్య క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య, కేవోఆర్ఎం మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు, కేవోఆర్ఎం మైదానంలో అనంత పురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు వుంటాయన్నారు. సెప్టెంబ ర్ 7 నుంచి 9వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు, కేవోఆర్ ఎం మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుతాయన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు-నెల్లూరు, కేవోఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు ఏసీఏ క్రికె ట్ మైదానంలో అనంతపురం-కడప, కేవోఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్డి ప్రసాద్ తెలిపారు.

ఈ పోస్ మిషన్ల ద్వారా ఎరువులు విక్రయించాలి

● వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న అన్ని రకాల ఎరువులను ఈ పోస్ మిషన్ల ద్వారా క్రయ, విక్రయాలను తప్పనిసరిగా జరపాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ పేర్కొన్నా రు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందికి ఈ పోస్ మిషన్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నా యని... ఇక నుంచి ఈ పాస్ మిషన్ల ద్వారానే క్రయ విక్రయాలను చేపట్టాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 100 మంది రైతు సేవా సిబ్బందికి ఈ పోస్ మిషను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెండరు ప్రకటన

జిల్లా ప్రజా పరిషత్తు కార్యాలయం, కడప

ఉత్తర్వు ఆర్.సి.నెం. ఎ7/2865/2024, తేదీ: 29.08.2025.

జిల్లా ప్రజా పరిషత్, కడప కార్యాలయ ఆవరణములో (రైతు బజార్ ఎదురుగా) వున్న జిల్లా ప్రజా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 8 రూములు షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుకొని పడమటి దిశన యున్న ఖాళీ స్థలం నందు మరియు వేంపల్లి యందు గల జిల్లా ప్రజా పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని 17 రూముల యందు వ్యాపారము చేసుకొనుటకు గాను ఆసక్తి గల ఏజన్సీలు/ సంస్థలు/ వ్యక్తుల నుండి టెండరు దరఖాస్తులు కోరబడుచున్నవి.

1) దరఖాస్తు ఫారములు **తేదీ: 30-08-2025 నుండి తేదీ: 09-09-2025 వరకు** కార్యాలయ పని దినములలో ఉదయం గం॥ 10.30ల నుండి సా॥ గం॥ 05.00ల వరకు రూ.2000/-ల రుసుము చెల్లించి పొందగలరు.

దరఖాస్తు ఫారములు అమ్మబడు ప్రదేశములు:

అ) వేంపల్లి Z.P. షాపింగ్ కాంప్లెక్స్: మండల ప్రజా పరిషత్ కార్యాలయము, వేంపల్లి

ఆ) కడప Z.P. షాపింగ్ కాంప్లెక్స్: అకౌంట్స్ విభాగము, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయము, కడప

2) పూర్తి చేసిన దరఖాస్తు ఫారములను సీల్డ్ కవర్లో ఉంచి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయములో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీల్డ్ టెండరు బాక్సు లోపల **10-09-2025వ తేదీన ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2.00 గంటల లోపు** వేయవలెను.

3) **10-09-2025వ తేదీన మధ్యాహ్నం 3.00 గంటలకు** టెండరుదారుల సమక్షములో టెండరు బాక్సు తెరువబడును.

4) ఇతర వివరముల కొరకు పరిపాలనాధికారి, అకౌంట్స్ విభాగము, జిల్లా ప్రజా పరిషత్, కడప వారిని సంప్రదించగలరు.

షాపింగ్ కాంప్లెక్స్ పేరు		రూము నెంబరు	గది విస్తీర్ణం చదరపు అడుగులలో	కనీస అద్దె మొత్తము	ధరావత్తు మొత్తము రూ.లు	అగ్రిమెంటు కాల పరిమితి
కడప	Ground Floor	1A	267	17,400	2,00,000	3 సం॥
	Ground Floor	1B, 2	380	25,000	2,00,000	3 సం॥
	Ground Floor	3, 4	380	22,000	2,00,000	3 సం॥
	Ground Floor	11	380	18,000	2,00,000	3 సం॥
	First Floor	1A	267	10,500	1,50,000	3 సం॥
	First Floor	1B	380	15,000	1,50,000	3 సం॥
	ఖాళీ స్థలం			10,000	50,000	1/2 సం॥
వేంపల్లి	Ground Floor	1, 7	284	20,700	2,00,000	3 సం॥
	Ground Floor	24	116	5,100	1,00,000	3 సం॥
	Ground Floor	28	112	5,100	1,00,000	3 సం॥
	Ground Floor	31, 32, 33, 34	110	5,100	1,00,000	3 సం॥
	Ground Floor	35	154	6,500	1,00,000	3 సం॥
	First Floor	2, 3, 4	150	4,000	50,000	3 సం॥
	First Floor	7 & 8 (ఒకే రూముగా కలిపి)	462	10,000	1,00,000	3 సం॥
	First Floor	9,10,11,12	220	6000	50000	3 సం॥

ముఖ్య కార్య నిర్వహణాధికారి, జిల్లా ప్రజా పరిషత్తు, వై.యస్.ఆర్. జిల్లా.

రాయలసీమ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడికి
ఎన్నికల కమిషన్ నోటీసులు

గాలివీడు, ఆగస్టు29(ఆంధ్రజ్యోతి): గత ఆరేళ్ల నుంచి పోటీ చేయని కారణంగా రాయచోటి నియోజకవర్గంలోని రాయలసీమ కాంగ్రెస్ పార్టీని రాజకీయ పార్టీల జాబితా నుంచి తొలగించాలంటూ పంపుతున్న ప్రతిపాదనకు ఆ పార్టీ బాధ్యుల నుంచి సంజాయిషీ కోరినట్లు ఎన్నికల నమోదు సహాయ అధికారి, తహసీల్దార్ భాగ్యలత శుక్రవారం తెలిపారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకుడు కే. జలీల్‌బాషాకు సమాచారాన్ని అందజేశామన్నారు. సెప్టెంబరు 8న వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయానికి స్వయంగా వెళ్లి రాతపూర్వకంగా సంజాయిషీ ఇవ్వాలని అతనికి విజ్ఞప్తి చేస్తున్నట్లు వివరించారు.


భువనేశ్వరి అమ్మవారికి పూజలు

రైల్వేకోడూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): భుజంగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం భువనేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అలంకరణలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకుడు ధూర్జటి యోగీశర్మ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వీఆర్వోల బాధ్యతల స్వీకరణ

గాలివీడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్లకుంట, గోపనపల్లె, అరవీడు, పూలికుంట గ్రామాల్లో వీఆర్వోలు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా వీఆర్వోలు వెంకటయ్య, గంగాధర్, సుబ్బరాయుడు , హేమలత మాట్లాడుతూ తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు..



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో శుక్రవారం జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిష నల్ ఎస్పీ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని ఆదేశించారు. జిల్లాలో తగినంత యూరియా అందుబాటులో ఉందని , రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. ప్రతి ఎరువుల దుకాణం లో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ జె.మురళీకృష్ణ, సిబ్బంది టిప్పు సుల్తాన్, వ్యావసాయశాఖ అధికారి సందీప్, వ్యవసాయశాఖ అధికారి ఏ.సుధీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

గణపతికి సినీ నటుల పూజలు



వినాయక మండపం వద్ద సినీనటులు

గాలివీడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరెడ్డిగారిపల్లె గణేశ్ వేడుకల్లో దూరదర్శిని సినిమా హీరో, హీరోయిన్ బొజ్జ సువిక్షిత్, గీతిక, రజన్‌లు పాల్గొన్నారు. శుక్రవారం గణేశ్ నవరాత్రుల్లో భాగంగా నటుడు సువీక్షిత్ స్వగ్రామం అయిన బోరెడ్డిగారిపల్లెలో గణేశ్ మండపాన్ని సందర్శించి గణనాధుడికి ప్రత్యేక పూజలు చేశారు. సినీ నటీనటులు రావడంతో స్థానిక యువత వారికి బాణాసంచాలతో ఘనస్వాగతం పలికారు. యువత సినీ హీరో, హీరోయిన్‌లతో కలిసి సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సహనటులు జెమిమి సురేశ్, లావణ్యారెడ్డి, తేజ, బలరాజు, విహాన్ పొన్నం తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో అన్నదానం

పుల్లంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : తన సోదరుడు ముద్దా ప్రకాష్‌రెడ్డి కుమారుడు విజయరెడ్డి(కోటి) ప్రథమ వర్ధంతి సందర్భంగా పుల్లంపేటలోని ప్రభుత్వ బాలికల హాస్టల్లో శుక్రవారం ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశ్రీ, ఏవో శ్రీధర్‌రెడ్డి, ఈవోఆర్డీ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'గిడుగు' తెలుగు భాషకు గొడుగు

● ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు గొడుగు వంటి వాడని రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి లంకాయగారి నాగయ్య తెలిపారు. నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాల్లో ఆయన మాట్లాడారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకట రమణ, తెలుగు ఉపాధ్యాయిని గీత, వ్యాయామ ఉపాధ్యాయిని గౌరి, డాక్టర్ శర్వాణిని ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ ప్రదర్శించిన మౌలాని, ప్రత్యూష, హర్షిణి, మాళవిక, భావన తదితరులకు బహుమతులు అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు నివాళులర్పించారు ఎస్‌ఐ మన్నెం రామ్మోహన్, లయన్ కుర్రా మణియాదవ్, కొత్తపల్లి రాజాచారి, గంధం గంగాధర్, మోడపోతుల రాము, తీగలకుంట వెంకటేష్‌లు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : పట్టణంలోని బోసనగర్ జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుబు మహ మ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి కేవలం పండితులకే పరిమితమమైన భాషను అందరికీ అర్థమయ్యే విధంగా తీర్చిదిద్దారని ఉపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి, సిరాజ్, రియాజ్, ఓబులమ్మ, అమీరున్నీషా, ముస్తాక్‌అహ్మద్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

గాలివీడు: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో తెలుగు భాషా దినోత్సవ, జాతీయ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వ్యాసరచన, క్రీడా పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్‌జాఫర్‌హుస్సేన్, తెలుగు ఉపాధ్యాయుడు బుక్కపట్నం రవీంద్రబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు గంగరాజు, ఇతర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: ఏపీ మోడల్ స్కూల్‌లో నివాళులు అర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, తెలుగు ఉపాధ్యాయుడు రాజశేఖర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: ఉద్యాన కళాశాలలో అసోసియేట్ డీన్ పీటీ శ్రీనువాసులు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హరి, మల్లికార్జునరెడ్డి, ఓఎస్‌ఏ డాక్టర్ ముకుందలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తె సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి. రమేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజంపేట: బీజేపీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. రమణ, శ్రీనివాసులు, సుబ్రమణ్యంనాయుడు, నగేష్ పాల్గొన్నారు. మన్నూరు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కొండూరు పరిమళ, ఉపాధ్యాయులు హైమావతి, శ్రీనివాసులు, శ్రీనాథ్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పెంచలమ్మ, రమేష్‌బాబుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు.

సిద్దవటం: మండలంలోని పార్వతీపురం గ్రామంలో ఎస్‌టీవీడీ ఎయిడెడ్ సభా హైస్కూల్లో కరస్పాండెంట్ మధుసూదన్ నివాళులర్పించారు.

వీరబల్లి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ అజంతుల్లా , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య ఉపాధ్యాయ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించండి

●ఎంపీపీ గడికోట విజయలక్ష్మి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జాషువా

రామాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రామాపురం మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ సభాభవనంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాల్లో అధికారులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ ప్రకారం పింఛన్ మంజూరవుతుందన్నారు. ఎంపీడీవో జాషువా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4,999 పింఛనర్లకు 2.15 కోట్ల రూపాయలు మంజూ రైందన్నారు. ఉపాధి కూలీలకు మూడు నెలల నుంచి కూలి అందడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కేంద్రం నుంచి నిధులు మంజూరైన వెంటనే కూలీల ఖాతాల్లో నగదు జమ చేస్తామని ఎంపీడీవో తెలిపారు. మండలంలో పలువురు లబ్ధిదారులు పక్కా గృహాల నిర్మాణం ఇప్పటికీ పూర్తి చేయలేదని, ప్రభుత్వం స్టీల్, సిమెంటు మంజూరు చేస్తే వెంటనే పూర్తి చేస్తారని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మానస వెంకట్రమణ, అన్నిశాఖల అధికారులు, గ్రామ స్థాయి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వేడుకగా గంగమ్మ ఒడికి గణనాథుడు



కోడూరు: నిమజ్జనానికి తరలుతున్న గణపతి



రాజంపేటలో..



చిట్వేలులో..

సిద్దవటం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా గ్రామాల్లో పూజలందుకున్న గణనాధుడు. శుక్రవారం పెన్నమ్మ ఒడిలోకి చేరుకున్నా. సిద్దవటం హైలెవల్ వంతెన వద్ద నిర్వహించిన నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంచనీయ సంఘటన జరగకుండా క డీఎస్పీ బాలస్వామిరెడ్డి, సీఐ బాబు, ఎస్ఐ మహమ్మద్‌రఫీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వినాయకుడికి సమర్పించిన లడ్డూను వేలం వేయగా సిద్దవటం గ్రామానికి చెందిన కూన కార్తిక్ 28,500 రూపాయలకు దక్కించుకున్నారు. ఆయనను కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించారు.

రైల్వేకోడూరు రూరల్: కోడూరు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ నిమజ్జనానికి తరలించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని అంకమ్మనగర్‌లో వినాయకుడి లడ్డూలను ముద్దపోలు మోహన కృష్ణ రూ.45 వేలకు, చింతం తేజ రూ.20 వేలకు దక్కించు కున్నారు. నరసరాంపేటలో రఘురామయ్య రూ.37,116కు, అనంతరాజు పేటలో గిద్దలూరు రవితేజ 3.60 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు. హుండీ డబ్బులను రూ. 15,100కు కొనిపాటి శ్రీనివాస్ రూ.15,100తో దక్కించుకున్నారు.

రామాపురం : నల్లగుట్టపల్లె పంచాయతీ పాత రామాపురం, కడవకూటి వాండ్లపల్లె, గొల్లపల్లి, ఉప్పరపల్లి, జింకలకుంట హరిజనవాడ గ్రామా ల్లో వినాయక నిమజ్జనాలు చేశారు. .రామాపురం : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్‌నాగిరెడ్డి చిట్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సందర్శించారు.

నందలూరు: నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఆర్ఎస్ రోడ్డులోని ఎన్టీఆర్‌నగర్‌లో ప్రభుత్వ వైద్యులు హీరేంద్రసింగ్ తండ్రి లోక్‌మాన్‌సింగ్, మహానందిగారి సంతోష్‌రెడ్డి, తండ్రి రామ్మోహన్‌రెడ్డి పేటగడ్డ లో తోట కేదార్‌నాథ్‌బాబు, జట్టి జగదీష్ అన్నదానం చేశారు.

చిట్వేలి: మండలంలో 123 విగ్రహాలను ఏర్పాటు చేయగా శుక్రవారం 55 విగ్రహాలను నిమజ్జనం చేశారు. అన్ని ప్రాంతాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం నిమజ్జనం చేశారు. ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది యల్లమరాజు చెరువులో ఏర్పాట్లు చేశారు.

రాజంపేట టౌన్ : రాజంపేటలో శనివారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. జైగణేష్ మహరాజ్‌కు జై అంటూ నినాదాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ డప్పులు వాయించుకుంటూ ప్రత్యేక వాహనాల్లో గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు. .

వీరబల్లి: స్థానిక బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద గొట్టివీటి కృష్ణ, సురేశ్ ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి నాని, హేమంత్, జ్ఞానేశ్వర్, యశ్వంత్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందలూరు: వినాయక మండపం వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



అంకమ్మనగర్‌లో లడ్డూ దక్కించుకున్న మోహన కృష్ణ



సిద్దవటం: వేలంలో లడ్డూ దక్కించుకున్న భక్తుడు

'మూడ్ ఆఫ్ నేషన్ సర్వేలో చంద్రబాబుకు మూడో స్థానం'

రాయచోటిటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియా టుడే నిర్వహించిన మూడ్ ఆఫ్ నేషన్ సర్వేలో దేశంలోని బెస్ సీఎంలలో చంద్రబాబుకు మూడో స్థానం లభించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేయడంతో పాటు,అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ సమ ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇతర రాష్ట్రాల్లో కూడా మద్దతు లభిస్తోందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకొని తెలుగుదేశం ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలకు మద్దతు పలికి ప్రజల్లో అభాసుపాలు కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

వై.కోటకు ఆర్టీసీ బస్సు నడపాలి

ఓబులవారిపల్లె ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వై.కోట గ్రామానికి బస్సు నడపాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.కోట గ్రామవ సుమారు 5600 మంది జనాభా కలిగి ఉందని, రోజూ వందలాది మంది కోడూరుతోపాటు చుట్టుపక్కల పల్లెలకు వెళుతుంటారన్నారు. ఈ బస్సు సర్వీసుతో అనంతరాజుపేట, రామయ్యపాలెం, నారాయణరాజుపోడు, చలంపాలెం, వెంగళరాజుపోడు, కంద్రిక, సున్నపురాళ్లపల్లె, తదితర గ్రామాలవారికి ఉపయోగంగా ఉంటుందని వారు తెలియజేశారు. ప్రభుత్వ అధికారులు, నాయకులు స్పందించని పక్షంలో వైకోట గ్రామ పంచాయతీ మహిళలతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోడూరు బస్టాండు దగ్గర నిరసన తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కె.వెంకటరమణ, మల్లికా, వెంకటరమణ, కె.గోపాల్, ఎం.రామయ్య, కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి నాయకుడు పూల భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ప్రదర్శన చేసి అన్నమయ్య విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబరు 1న రాజంపేటకు వస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని స్పష్టమైన ప్రకటన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబూబకర్, తాళ్లపాక నాయకులు అదృష్టదీపుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం, మన్నూరు నాయకులు పోకల ప్రభాకర్, న్యాయవాదులు నాసరుద్దీన్, కత్తి సుబ్బరాయుడు, టీచర్ల సంఘం నాయకులు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. సుమారు 4 వేల పోస్టు కార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు పంపారు. ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకుడు ప్రభాకర్‌నాయుడు, వెంకటేశ్వర్‌రెడ్డి, సుభాష్, నందకిషోర్, సుబ్బరాయుడు, చౌదరి, జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, గుల్జార్‌బాషా, రామచంద్రరాజు, సుధాకర్, జనసేన నాయకులు అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ రాజంపేట మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మర్రి రవి తదితరులు ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ముగిసిన క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్

రైల్వేకోడూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో ఈ నెల 18 నుంచి నిర్వహించిన క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ అంతర్గత పోటీలు శుక్రవారం ముగిసినట్లు కళాశాల అసోసియేట్ డీన్ పీటీ శ్రీనువాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీ ఆధారిత సమస్యల పరిష్కారాలపై విద్యార్థులు వినూత్న ఆలోచనలను ప్రదర్శించారని తెలిపారు. ఈ పోటీల్లో చక్కని ప్రతిభ చూపిన వంశీ, గీతిక బృందాలు సెప్టెంబరు 10న తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించే సెమీఫైనల్స్‌కు ఎంపిక అయ్యారని తెలిపారు.

హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌కు నివాళి



ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, విద్యార్థులు

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భం గా రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో శుక్రవారం జా తీయ క్రీడా దినోత్సవాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రిన్సి పాల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బి.నాగముని మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ 1928, 32, 36 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా మూడు సార్లు బంగారు పతకాలు సాధించి దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

రామాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని మెప్మా పీడీ మండల స్పెషలాఫీసర్ లక్ష్మిదేవి తెలిపారు. మండలంలోని చిట్లూరు సెక్టార్ పరిధిలోని పొత్తుకూరుపల్లె అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్ యాక్టివిటీస్ చేయించారు. మెనూ ప్రకారం వంట చేశారా లేదా అని పరిశీలించారు. పాలు, గుడ్లు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా, వాటిని గర్భిణులు, బాలింతలు తీసుకుంటున్నారా లేదా అన్న అంశాలు ఆరా తీశారు. చేతుల శుభ్రతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అక్షరాస్యత శాతం పెంచాలి

వీరబల్లి, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): అక్షర ఆంధ్ర ఉల్లాస్ ద్వారా అక్షరాస్యత శాతం పెం చాలని మండల విద్యాశాఖాధి కారి కృష్ణయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ సభాభవనంలో వలంటీర్ టీచర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 2,380 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా మండల వ్యాప్తంగా 238 అక్షర కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వెలుగు ఏపీఎం ఖాదర్‌వలి మాట్లాడుతూ మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి ఒక్కొక్క కేంద్రంలో 10 మంది చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు 2 గంటలు వీడియో చిత్రాల ద్వారా కుటుంబం, ఆచారాలు, పరిశుభ్రత, ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లల పెంపకం, చట్టాలు, డిజిటల్ లావాదేవీలు మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఐసీడీఎస్ అధికారిణి సరస్వతమ్మ సీసీలు నాగేంద్ర, కృష్ణయ్య, సుధాకర్, గంగాధర్, ఉపాధి హామీ ఈసీ ఆంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, వీవోఏలు, వలంటీర్ టీచర్లు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు అందజేత

సుండుపల్లె, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థి తిమ్మసముద్రం వాసి తాతినేని బాలాజీనాయుడు రూ. 40 వేల విలువ చేసే క్రీడా సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్రీడల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయిని రాధారాణి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం షకీరా బేగం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లేమిని సీఎం దృష్టికి తీసుకెళ్లాలి

రాజంపేట టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఒకటో తేదీన రాజంపేటకు రానున్న ముఖ్యమంత్రికి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఎం జిల్లా నేత రవికుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేసి మూడేళ్లు దాటినా ప్రాజెక్టుల పరిస్థితి అధ్వానంగా ఉందని, అన్నమయ్య ప్రాజెక్టు పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. గాలేరు నగరి సుజల స్రవంతి ఊసే లేదన్నారు. రైల్వేకోడూరు అప్సా జ్యూస్ ఫ్యాక్టరీ, నందలూరు ఆల్విన్, రైల్వేలోకో షెడ్ పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిమజ్జనం ఊరేగింపులో ఘర్షణ

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామ అరుంధతివాడలో శుక్రవారం నిమజ్జనం ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. గుంటి శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, పెంచలమ్మ మరో ఐదుగురు గాయపడ్డారు. నలుగురికి తీవ్ర గాయాలు కాగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి, ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించారు. పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బస్సు బైక్ ఢీ - రైతు దుర్మరణం

తంబళ్లపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు-బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో రైతు శ్రీనివాసులరెడ్డి (50) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు తంబళ్లపల్లె మండలం రెడ్డికోట పంచాయతీ కొప్పలవారిపల్లె వాసి శ్రీనివాసులరెడ్డి సొంతపనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో కోటకొండకు వస్తుండగా మార్గమధ్యలో గుండాలవంక మలుపు వద్ద ఆర్టీసీ బస్సు- బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న రైతు శ్రీనివాసులరెడ్డిని స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అత్యవసర విభాగం వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి


రామ్లానాయక్ (ఫైల్‌ఫొటో)

సుండుపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని మాచిరెడ్డిగారి పల్లె పంచాయతీ చిన్నబిడికికి చెందిన రామ్లానాయక్ (70) గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం పించా నది సమీపం లోని నీటి గుంతలో అతని మృతదేహాన్ని బాటసారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని వెలికి తీయించి చిన్నబిడికీ వాసిగా గుర్తించామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులో పడి కాగితి నరేష్ (40) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలకడ మార్గంలోని అంకాలమ్మ గుడి సమీపంలోని ఉమ్మనగుంట చెరువులోకి దిగాడు. పట్టుతప్పి నీళ్లలోకి పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగి చనిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఏఎస్ఐ మహబూబ్ సాహెబ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

నిమ్మనపల్లి ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ దాసరిపేట వాసి తుపాకుల రోహిత్ కుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాల్లోకెళ్తే.. దాసరిపేటలో వినాయక ప్రతిమను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా కమిటీ సభ్యులు గురువారం రాత్రి హిజ్రాలతో అసభ్యకర డ్యాన్సులు వేసేందుకు ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో గురువారం కమిటీ సభ్యులు ప్రసన్న కుమార్, కొండప్ప, హేమంత్‌ను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. కాగా వీరివెంటే వెళ్లిన సదరు గ్రామానికి చెందిన రోహిత్‌కుమార్ స్టేషన్‌లో గందరగోళం సృష్టించి పోలీసులను దుర్భాషలాడి దాడికి యత్నించినట్లు ఎస్ఐ తెలిపారు. దీంతో కానిస్టేబుల్ హరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచగా జడ్జి 14 రోజులు రిమాండు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డులు
మరో మూడు నెలల పొడిగింపు

రాయచోటి(నేతాజీసర్కిల్)/కడప కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాలపరిమితిని మరో మూడు నెలలపాటు పొడిగిస్తున్నట్లు సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆగస్టు 31 వరకు అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న పాత్రికేయులకు సెప్టెంబరు 1, నుంచి నవంబరు 30 వరకు, నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు అమలులో ఉంటాయని ఆయన తెలిపారు.

డ్రైవర్‌కు నాలుగున్నరేళ్లు జైలు


డ్రైవర్‌తో కోర్టు కానిస్టేబుల్

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును ఢీకొని ఆరుగురి మృతికి కారణమైన కేసులో సిమెంటు ట్యాంకర్ డ్రైవర్‌కు నాలుగున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజంపేట 3వ అదనపు జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. 2023 జూలై 20న డ్రైవర్ మహదేవ మద్యం మత్తులో సిమెంటు ట్యాంకర్‌తో ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా 29 మందికి గాయాలయ్యాయి. అప్పటి ఓబులవారిపల్లె ఎస్ఐ బి.శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదు చేశారు. రాజంపేట ఇన్‌చార్జి సీఐ నరసింహారావు, అనంతరం డీఎస్పీ వీఎన్‌కే చైతన్య దర్యాప్తు చేసి కోర్టుకు చార్జీషీటు సమర్పించారు. 56 మంది సాక్షులను విచారణ చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిజాంజానీ, రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామ్‌నాథ్‌హెగ్డే, కోడూరు రూరల్ సీఐ పి.వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్, సాక్షులను సమయానికి కోర్టులో ప్రవేశపెట్టిన కోర్టు కానిస్టేబుల్ (862) వెంకటరమణలను ఎస్పీ అభినందించారు.

అనంతపురం ఎఫెక్ట్..!

- తిరోగమనంలో మదనపల్లె మార్కెట్
- లబోదిబోమంటున్న రైతులు

సగానికి తగ్గిన టమోటా ధరలు

మదనపల్లెటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోటా మార్కెట్‌కు అనంతపురం టమోటా మార్కెట్ దెబ్బతీస్తోంది. గత పది రోజులుగా మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వస్తున్న టమోటా 80 శాతం తగ్గిపోగా, ధరలు కూడా సగానికి సగం తగ్గిపోయాయి. దీంతో రైతులు బేర్ మంటున్నారు. నిత్యం 1500 టన్నుల టమోటా విక్రయానికి వస్తున్న పరిస్థితి నుంచి నేడు కేవలం నిత్యం 90 టన్నుల టమోటా మాత్రమే విక్రయానికి వస్తుండటం చూస్తే మదనపల్లె మార్కెట్ ఎంత అధ్వాన స్థితికి దిగజారిందో.. తద్వారా మార్కెట్ వార్షిక ఆదాయంపై పెద్ద దెబ్బపడుతోంది.

మదనపల్లె మార్కెట్ దినదినం తిరోగమనం

దేశంలోనే అతి పెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన మదనపల్లె దినదిన ప్రవర్థమానం కాకుండా దినదినం తిరోగమనంలోకి పడిపోతోంది. 11 ఎకరాల విస్తీర్ణం వున్న మార్కెట్ ఇరుకుగా మారిపోవడం, లారీ యూనియన్ల మధ్య సమ స్యలు, టమోటా లోడింగ్, అన్‌లోడింగ్, జాక్‌పాట్ విధానం, క్రేట్లకు బాడుగ తీయడం, ముఖ్యంగా ఉదయం మార్కెట్‌కు వచ్చిన రైతులకు టమోటా ట్రేడర్స్ సాయంత్రం వరకు టమోటా బిల్లులకు డబ్బులు చెల్లించకపోవడం వెరసి మదనపల్లె మార్కెట్ దినదినం అథోగతి పాలవుతోంది. దీంతో టమోటా సీజన్ ముగియకనే ఇక్కడికి ప్రతిరోజు 1500 టన్నులు నుంచి నేడు 90 టన్నుల వరకు మాత్రమే విక్రయాలకు పడిపోయాయి. ఈ దెబ్బకు ఇక్కడి టమోటా ధరలు కూడా సగానికి సగం పడిపోతున్నాయి.

గత రెండు నెలలుగా మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు నిలకడగానే సాగాయి. కాని నాలుగు రోజులుగా ధరలు ఒక్కసారిగా సగానికి సగం పడిపోయాయి. గత జూన్, జూలై నెలలు, ఆగస్టు 22వ తేది వరకు మదనపల్లె మార్కెట్‌లో టమోటా గరిష్ఠంగా కిలో రూ.50 పలుకగా, కనిష్టగా కిలో రూ.20 పలికాయి. ఈ ధరలు పలికిన సమయంలో రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు కాస్త లాభాలు కళ్ల చూసారు. కాని ఆగస్టు 22వ తేది నుంచి మదనపల్లె మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా పతనం అవుతున్నాయి. గరిష్ట ధర కిలో రూ. 50 నుంచి రూ.44, రూ.36, రూ.26కు పడిపోయాయి. అలాగే కనిష్ట ధర కూడా కిలో రూ.20 నుంచి కిలో రూ.15 వరకు పడిపోయింది. అంతేకాకుండా జూన్ నెలలో ప్రతిరోజు మార్కెట్‌కు సరాసరిన 1500 మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి రాగా, జూలైలో వెయ్యి మెట్రిక్ టన్నుల టమోటా విక్రయానికి వచ్చింది. కాని జూలై 18వ తేది నుంచి మార్కెట్‌కు వచ్చే టమోటా గణనీయంగా తగ్గిపోతూ ప్రతి రోజు 500 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. ఇదే ఆగస్టు నెల ప్రారంభంలో 300 టన్నులు రాగా నేడు కేవలం 96 మెట్రిక్ టన్నులకే టమోటా దిగుబడి పడిపోయింది.




మదనపల్లె మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన టమోటా, (ఇన్‌సెట్లో) మార్కెట్ కమిటీ కార్యాలయం

అనంతపురం సీజన్ ఎఫెక్ట్...

అనంతపురం జిల్లాలో జూలై నెల నుంచి టమోటా దిగుబడి ప్రారంభమవుతుంది. ముఖ్యంగా వేడి వాతావరణం పోయి, వాతావరణం చల్లబడటం, వర్షాలు పడుతుండటంతో అక్కడి టమోటా తోటల్లో దిగుబడి ఒక్కసారిగా పెరిగిపోయింది. దీంతో వ్యాపారులు కూడా మదనపల్లె మార్కెట్‌ను వదిలేసి అనంతపురం మార్కెట్‌కు పోలోమంటూ వెళ్లిపోయారు. ఇది కూడా మదనపల్లె మార్కెట్‌లో ధరలు పడిపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ సీజన్ ముగుస్తుండడంతో టమోటా నాణ్యత కూడా తగ్గిపోవడం మరో కారణంగా చెప్పవచ్చు. అంతేకాకుండా మదనపల్లె మార్కెట్‌తో పోలిస్తే ములకలచెరువు, అంగళ్లు, గుర్రంకొండ మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చే టమోటాలకు మంచి ధరలు వస్తుండటంతో రైతులు ఈ మార్కెట్‌లకే ప్రాధాన్యత ఇస్తూ మదనపల్లె మార్కెట్‌ను తిరస్కరిస్తున్నారు. దీంతో దేశంలో అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరుపొందిన మదనపల్లె మార్కెట్ తిరోగమనంలో పడిపోతోంది. మదనపల్లె టమోటా మార్కెట్‌కు గతంలో మార్కెట్ సెస్సు కింద వసూలు చేయడం, మండీల అద్దెలు, మార్కెట్‌లో షాపింగ్ గదుల అద్దె కలిపి వార్షిక ఆదాయం రూ.3కోట్లకు పైగా వచ్చేది. భవిష్యత్‌లో పై తెలిపిన పరిస్థితులు కొనసాగితే మదనపల్లె మార్కెట్ వార్షిక ఆదాయం గణనీయంగా పడిపోయి, సగానికి సగం తగ్గిపోయినా ఆశ్చర్యపడనవసరం లేదని విశ్లేషకుల అభిప్రాయం. ఇకనైనా జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లె మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాల్సి వుంది.

రాజంపేట పూర్వ ఆర్డీఓపై విచారణ

- కోర్టు కేసుల్లో ప్రభుత్వానికి చిక్కులు
- ఇప్పటికే సస్పెన్షన్‌లో వున్న కోదండరామిరెడ్డి
- విచారణాధికారిగా జేసీ ఆదర్శ రాజేంద్రన్

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పూర్వ ఆర్డీఓ, ప్రస్తుతం తిరుపతి గాలేరు నగరి యూనిట్-1 ఎస్‌డీసీ డి.కోదండరామిరెడ్డిపై విచారణకు ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. విచారణాధికారిగా అన్నమయ్య జిల్లా జేసీ ఆదర్శ రాజేంద్రన్‌ను, ప్రెజెంటింగ్ అధికారిగా డీఆర్‌ఓ కె.మధుసూదనరావును నియమించింది. రెండు నెలల్లోగా విచారణ ముగించి నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రాజంపేట ఆర్డీఓగా, జీఎన్ఎస్ఎస్ భూసేకరణ విభాగంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా అదనపు బాధ్యతలు నిర్వహించే సమయంలో ఒక కోర్టు కేసులో అనాలోచితంగా వ్యవహరించి తీవ్ర తప్పిదాలకు పాల్పడడంతో ప్రభుత్వానికి కోర్టులో ఇబ్బందులెదురయ్యాయి. చాలా రోజుల విచారణ అనంతరం గతేడాది ఆగస్టు 30న ప్రభుత్వం కోదండరామిరెడ్డిని సస్పెండ్ చేసింది. అనంతరం ఆయన సంజాయిషీలు సంతృప్తికరంగా లేకపోవడంతో డిసెంబరు 13న ఆయనపై ప్రభుత్వం అభియోగాలు నమోదు చేసి నోటీసులు జారీ చేసింది. దీనికి సంబంధించిన పూర్వాపరాలు ఇలా వున్నాయి.

సోమశిల ప్రాజెక్టు కింద 54 ముంపు గ్రామాలకు పునరావాసం, పరిహారాల చెల్లింపులపై ఆ గ్రామాల తరపున కె.నాగిరెడ్డి 2022లో హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు కారణంగా సోమశిల ఫేజ్-2లో ముందుకెళ్లడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. అయితే జీఓ నెం.68 ప్రకారం, కొత్త భూసేకరణ చట్టం ప్రకారం పునరావాసం, పరిహారాల చెల్లింపులు సాధ్యపడదని, అది ప్రభుత్వ ఖజానాపై తీవ్ర భారం పడుతుందని కోదండరామిరెడ్డి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. వాస్తవానికి ఈ కేసులో ఈయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, కడప, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు, కడప భూసేకరణ ఆర్డీఓలు ప్రతివాదులుగా వున్నారు. అయితే వీళ్లలో ఎవరి ప్రమేయం లేకుండానే అందరి తరపున కోదండరామిరెడ్డి జీఓ 68ని ఉటంకిస్తూ కౌంటర్ దాఖలు చేశారు. చివరికి తేలిందేమిటంటే అసలు జీఓ68 సోమశిల ముంపు ప్రాంత రైతులకు సంబంధించినది కాకపోవడం. అంతేగాకుండా 54 ముంపు గ్రామాల్లో 25 గ్రామాలు మాత్రమే రాజంపేట యూనిట్ పరిధిలోకి అంటే కోదండరామిరెడ్డికి సంబంధించినవి మాత్రమే. మిగిలిన 29 గ్రామాలు కడప భూసేకరణ విభాగానికి సంబంధించినవి. ఇదిలా వుండగా ఉన్నతాధికారులతో సంప్రదించకుండానే కోదండరామిరెడ్డి జీఓ 68ని తెరపైకి తెచ్చి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో ప్రభుత్వానికి చిక్కులెదురయ్యాయి. దీని కారణంగా సోమశిల ఫేజ్-2 ముందుకెళ్లడానికి అడ్డంకులేర్పడ్డాయి. ఈ విషయంపై పూర్తి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్

పీలేరురూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కడప విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బాబుమోసెస్ హెచ్చరించారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో కడప విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను క్యాష్ చేసుకోవాలని చూస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పీలేరులో యూరియా కొరత ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రెండుమూడు రోజుల్లో యూరియా రైతుల అవసరాల మేరకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. వ్యాపారులు ఎక్కువ ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా సెక్షన్ 6(ఏ) ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎన్ని రకాల ఎరువులు విక్రయిస్తున్నారు. వాటి ధర, స్టాకు వివరాలు విధిగా నోటీస్ బోర్డులో ఎంటర్ చేయాలని చెప్పారు. రైతులు తీసుకునే ఎరువులు, విత్తనాలకు సంబంధించి విధిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఏవో రమాదేవి మాట్లాడుతూ రైతుల అవసరాలకు అనుగుణంగా వచ్చిన యూరియాను ఎప్పటికప్పుడు రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయిస్తామని చెప్పారు. పీలేరులో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఎక్కడా యూరియా లేదని తెలిపారు. విజిలెన్స్ అధికారులు పట్టణంలోని కిసాన్, అగ్రిక్లీనిక్, మారుతి ఫెర్టిలైజర్స్, సురేంద్రరెడ్డి షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టాకు రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఎరువుల గోడౌన్లలో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు.


గోడౌన్‌లో ఎరువులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

తెలుగును నిర్బంధం చేయాలి

- అవధాని లోకజగన్నాథశాస్త్రి


సభలో మాట్లాడుతున్న అవధాని లోకజగన్నాథశాస్త్రి

కలకడ, ఆగస్టు 29(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్ స్థాయిలో తెలుగు మాధ్యమాన్ని నిర్బంధం చేసే దిశగా చట్టంలో మార్పులు తేవాలని అవధాని లోకజగన్నాథశాస్త్రి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా బాటవారిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాష మనుగడకు వ్యవహర్తలే మూలమన్నారు. కడపకు చెందిన రంగస్థల కళాకారుడు మధుబాబు తెలుగు భాషా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. తన రాగాలాపనతో కార్యక్రమాన్ని రంజింపచేశారు. క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాయామ ఉపాధ్యాయుడు మురళీ హాకీ పితామహుడు ధ్యాన్‌చంద్ దేశఖ్యాతిని ప్రపంచస్థాయిలో తెలియజేశాడని కొనియాడారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని కోరారు. అంతకుమునుపు హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పాఠశాల ప్రాంగణంలోని కవుల శిలావిగ్రహాలు, గిడుగు రామ్మూర్తిపంతులు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులు, ఆకృతిగా ఏర్పడి తెలుగుభాషపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమాదేవి, మధు, శ్రీరాములనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘర్షణ పడిన ఇరువర్గాలు అదుపులోకి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీటీఎంలో గురువారం రాత్రి రెడ్డిశేఖర్, చిన్నరెడ్డెప్ప ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. రాత్రి సదుమనిగిన గొడవ శుక్రవారం ఉదయాన్నే రెడ్డిశేఖర్‌కు చెందిన వారు సుమారు 20 మంది సీటీఎంలోని చిన్నరెడ్డప్పకు సంబంధించిన వారి ఇళ్లపై దాడి చేశారు. వారు వెంటనే తాలుకా సీఐ కళా వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను పిలిపించి అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు వీధిరౌడీలుగా ఇళ్లపై దౌర్జన్యం చేసిన రెడ్డి శేఖర్ వర్గీయులపై పోలీసులకు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ విషయంలో ఇరువర్గాలను విచారిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

నేడు తిరుపతి-కాచిగూడకు ప్రత్యేక రైలు

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మధ్య కడప మీదుగా ప్రత్యేక వీక్లీ రైలును శనివారం నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు శనివారం రాత్రి 9.10గంటలకు తిరుపతిలో బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప మీదుగా 31వ తేదీ సోమవరం ఉదయం 11గంటలకు కాచిగూడకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

14 వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ లక్ష్యం

- ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న


సోంపల్లెలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న

ములకలచెరువు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 సంవత్సరానికి గానూ 14వేల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని సోంపల్లెలో శుక్రవారం డ్రిప్ పరికరాల నిర్వహణ, నీటి ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ములకలచెరువులలో శుక్రవాం పొలాల్లో అమర్చిన డ్రిప్‌ను పరిశీలించారు. అనంతరం ములకలచెరువులోని రైతు సేవా కేంద్రంలో ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి మైక్రో ఇరిగేషన్ రిజిస్ట్రేషన్, ప్రాథమిక సర్వే తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 10577 మంది రైతులు 12,711.71 హెక్టార్లలో ఆన్‌లైన్ ద్వారా డ్రిప్ పరికరాలకు నమోదు చేసుకున్నారన్నారు. ఐదు ఎరకాలలోపు విస్తీర్ణం కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో పరికరాలు అందిస్తున్నామన్నారు. అలాగే 10 ఎకరాల లోపల విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 90శాతం రాయితీ, 10 ఎకరాలకు పైగా విస్తీర్ణం కలిగిన అన్ని వర్గాల రైతులకు 50 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. రైతుసేవా కేంద్రాల సిబ్బంది తన పరిధిలోని నీటి వసతి కలిగిన రైతులను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించి ప్రాథమిక సర్వేలు చేపట్టి అంచాలు పూర్తి చేయాలన్నారు. రాయితీ పోయి రైతులు చెల్లించాల్సిన వాటాను ఈజీ పే ద్వారానే చెల్లించేలా చూడాలన్నారు. ఎవరు కూడా రైతుల నుంచి నగదు రూపంలో తీసుకోరాదన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ఉద్యానవనశాఖాధికారి భీమేష్, ఎంఐడీసీ హరినారాయణ, ఎంఐఈ కృష్ణానాయక్, ఎంపీఏవో స్వాతి తదితరులు పాల్గొన్నారు.

4న 5కే రెడ్ రన్ మారథాన్

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నివారణ సంస్థ సంయుక్తంగా యువతకు నిర్వహిస్తున్న 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమంపై డీఎంహెచ్‌వో డాక్టర్ కే. లక్ష్మీనరసయ్య గురువారం తన ఛాంబర్‌లో జిల్లాలోని అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్‌బాబు మాట్లాడుతూ సెప్టెంబరు 4వ తేదీ ఉదయం 5.30 గంటలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమయ్యే ఈ రన్ నారాయణరెడ్డి పల్లె వరకు వెళ్లి యూటర్న్ తీసుకుని తిరిగి కళాశాల వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న 17 నుంచి 25 ఏళ్లలోపు విద్యార్థులు అర్హులని తెలిపారు. పరుషులకు, మహిళలకు, ట్రాన్స్‌జెండర్‌లకు వేరు వేరుగా మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.7 వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. తెలిపారు. ఔత్సాహికులు అన్ని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని ఎన్ఎస్ఎస్ అధికారుల ద్వారా గూగుల్ ఫారం లింక్ ద్వారా తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఇతర వివరాలకు మస్తాన్ క్రీడాశాఖ అధికారి 7386901200 పీవీ ప్రసాద్, జిల్లా సూపర్‌వైజర్ 9959550368 వెంకటరావు, పీవీ విశ్వప్రసాద్ ఆర్ఆర్‌సీ కోఆర్డినేటర్స్ (9490782453, 9502374642), ప్రాజెక్టు మేనేజర్ టీ. స్వాతి 7569166129లను సంప్రదించాలని జిల్లా అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) అధికారి ఎం. రాంమోహన్‌రెడ్డి, గుర్రప్ప, జిల్లా క్రీడాశాఖాధికారి మస్తాన్, గౌస్‌బాషా, జిల్లా నెహ్రూ యువ కేంద్ర మై భారత్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఇంటర్ విద్యాశాఖ డీఐఈవో రవి, జిల్లా రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ వెంకటరావు, విశ్వప్రసాద్, క్లస్టర్ ప్రోగ్రాంమేనేజర్ వీ. భాస్కర్, క్రీడాశాఖ కోచ్ శ్రీనివాసరాజు, డీపీసీయూ, పీసీఎస్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

శతకవుల చిత్రాల ప్రదర్శన

రాయచోటి(నేతాజీసర్కిల్), ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సంబేపల్లె ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ నేతృత్వంలో శుక్రవారం వంద మంది శతకవుల చిత్రాల ప్రదర్శనతో తెలుగు తల్లికి నీరాజనాలు అర్పించారు. విద్యార్థుల తెలుగు పద్యాలు, పాటల ఆలాపన, సంప్రదాయ నృత్యాల ప్రదర్శన అలరించింది. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా పీడీ షామీర్ నేతృత్వంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


100 మంది కవుల చిత్రాలతో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ఆందోళన వద్దు...

● అప్పీల్ చేసుకున్న వారికి యథావిధిగా వికలత్వపు పింఛన్ల పంపిణీ ● జిల్లాలో 6వేల మందికి ప్రయోజనం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వికలాంగుల పింఛన్లలో అనర్హులను తొలగించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఏపీలో పెన్షన్లపై గత కొన్ని రోజులుగా రాజకీయంగా చర్చ సాగుతోంది. ఇప్పటికే అర్హత లేనివారు పెన్షన్లు పొందుతున్న ట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు గుర్తించారు. దీంతో పెన్షన్ల తొలగింపుపై కొందరికి నోటీసులు జారీ చేశారు. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల అర్హులైన వారు నష్టపోయే పరిస్థితి ఉంటే తిరిగి పునఃపరిశీలన కోసం నోటీసు అందిన 30 రోజుల్లోపు ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రం అందిస్తే వికలాంగులకు ఉన్న వికలత్వపు శాతంపై వైద్య బృందంపై స్పష్టత ఇవ్వనుంది. ఈక్రమంలో నిజమైన అర్హులకు మాత్రమే ప్రయోజనం చేకూరుతుందనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇదిలా ఉండగా అనర్హులుగా నోటీసులు అందుకున్న వారు అధికారులకు తమ అప్పీల్ సమర్పిస్తున్నారు. ఇలాంటి వారందరికీ వికలత్వం పునఃపరిశీలన పూర్తయ్యేంత వరకు పింఛన్లను యదావిధిగా కొనసాగించనున్నారు.

అయినా.... ఆందోళన

వికలాంగుల పింఛన్ రద్దుపై రాజకీయంగా విమర్శలు మొదలయ్యాయి. కొంతమంది గందరగోళం సృష్టిస్తున్నారు. ఈ క్రమంలో దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఎవరైతే అప్పీలు సమర్పించుకున్నారో వారికి మాత్రం సెప్టెంబరు 1న పింఛను పంపిణీ యదావిధిగా చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో వినతి సమర్పించిన దివ్యాంగులందరికీ సెప్టెంబరులో యదావిధిగా పెన్షన్లు అందుతాయన్నది స్పష్టమవుతుంది. దీనిపై ఎవ రూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి ఇటీవల సదరం సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్ చేశారు. అందులో 40శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారికి సెప్టెంబరు నుంచి పెన్షన్ నిలిపేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ పెన్షన్ కోత ఉండదని ప్రభుత్వం అభిప్రాయం. అందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వికలత్వం పునఃపరిశీలన పూర్తయిన తరు వాత అప్పీళ్లకు వెళ్లిన వారికి వారి వికలత్వం శాతం బట్టి పెన్షన్ అమలు చేయనున్నారు.

జిల్లాలో 6వేల మందికి ఉపశమనం

జిల్లాలో రద్దయిన వికలత్వపు పింఛన్లలో సుమారు 6వేల మందికి ఉపశమనం కలగనుంది. ఆన్‌లైన్ ప్రాంతాల్లో వినతులు సమర్పించడానికి 30న సాయంత్రం 5గంటలకు అనుమ తించనున్నారు. ఆఫ్‌లైన్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు వినతులు స్వీకరించడానికి గడువు విధించారు. ఈ క్రమంలో జిల్లాలో వినతులు సమర్పించిన వారి వివరాలిలా...

అట్లూరు మండలంలో 65 దివ్యాంగ పింఛన్లు తొలగించగా 56 మంది అప్పీలు చేసుకున్నారు. అదే విధంగా బి.కోడూరులో 116 మందికి గాను 80 మంది, బద్వేలు మండలంలో 81 మందికి 78 మంది, బద్వేలు మున్సిపాలిటీ ఏరియాలో 113 మందికి 72 మంది అప్పీలు చేసుకున్నారు. గోపవరం మండలంలో 88 మందికి 72 మంది, కలసపాడు మండలంలో 115 మందికి 114, పోరుమామిళ్ల మండలంలో 117 మందికి 114, కాశినాయన మండలంలో 103 మందికి 71, జమ్మలమడుగు మండలంలో 83 మందికి 80, మున్సిపల్ ఏరియాలో 79 మందికి 79 మంది అప్పీలు చేసుకున్నారు. కొండాపురం మండలంలో 300 మందికి 273, ముద్దనూరు మండలంలో 294 మందికి 266, మైలవరం మండ లంలో 115 మందికి 113, పెద్దముడియం మండలంలో 163 మంది కి 152, ఎర్రగుంట్ల మండలంలో 105 మందికి 95, మున్సిపాలిటీ పరిధిలో 54 మందికి 58 మంది అప్పీలు చేసుకున్నారు.

కడప నగరపాలకపరిధిలో 538 మందికి 211, కొన్ని వికలత్వపు పింఛన్ల కింద ఓఏపీ కిందమార్పు చేశారు. అలాంటి వారికి కూడా వికలత్వ పింఛను కింద ఆన్‌లైనులో 629 మంది నమోదు చేసుకున్నారు. సిద్దవటం మండలంలో 45కు 32 మంది, ఒంటిమిట్ట మండలంలో 66కు 55 మంది, చెన్నూరు మండలంలో 99 మందికి 104, చింతకొమమదిన్నె మండలంలో 154 మందికి 149, కమలాపురం మండలంలో 227మందికి 211, పెండ్లిమర్రి మండలంలో 232 మందికి 50, వల్లూరు మండలంలో 78 మందికి 79, వీరపునాయునిపల్లె మండలంలో 166 మందికి 84 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అదే విధంగా బ్రహ్మంగారిమఠం 125మందికి 115, చాపాడు మండలం లో 210కి 102 మంది, దువ్వూరు మండలంలో 246కు 217 మంది, మైదుకూరు మండలంలో 126కు నలుగురు మాత్రమే ఆన్ లైన్‌లో నమోదు చేసుకున్నారు. మైదుకూరు మున్సిపాలిటీపరిధిలో 122కు గాను 54 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రొద్దుటూరు అర్బన్ పరిధిలో 176 మంది, మండల పరిధిలో 207 మందికి గాను 193 మంది, రాజుపాలెంలో 111 మందికి 91, పులివెందుల నియోజకవర్గం చక్రాయపేటలో 203కు 95 మంది, లింగాల మండలంలో 436 మందికి ఒకరు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. పులివెందుల మండలంలో 114కు గాను 91మంది, మున్సిపల్ పరిధిలో 322 మందికి 273, సింహాద్రిపురం మండలంలో 180 మందికి 273, తొండూరు మండలంలో 451 మందికి 313, వేంపల్లె మండలంలో 451మందికి 313, వేముల మండలంలో 154కు గాను 85 మంది మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖా స్తు చేసుకున్నారు. ఇందులో గతంలో వికలత్వపు పింఛను వచ్చే వారికి వయసురీత్యా అర్హత ఉన్న వారికి వృద్ధాప్య పింఛన్ల కిందకి మార్పు చేశారు. ఈ రకంగా జిల్లాలో 7,182 వికలత్వ పింఛన్లకు 1177 పింఛన్లను ఓఏపీ కిందికి మార్పు చేశారు. వీరందరు కూడా తమకు వికలత్వపు పింఛన్లు మంజూరు చేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. వృద్ధాప్య పింఛన్లు 4వేలు, వికలత్వపు పింఛన్లు 6వేలు ఇవ్వడంతో చాలా మంది వికలత్వపు పింఛన్లు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే నిర్ణయం



ప్రభుత్వ ఆదేశాల వికలత్వపు పింఛన్లు కోల్పోయిన వారు తిరిగి అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పించాం.. ఆ విధంగా అప్పీలు చేసుకున్న వారికి తిరిగి వారి వికలత్వపు శాతం నిర్ధారణ అయ్యేంత వరకు వికలాంగుల పింఛన్లే అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అదే విధంగా వికలత్వపు పింఛను నుంచి వృద్ధాప్య పింఛన్లు పొందిన వారు కూడా తమకు వికలత్వపు పింఛన్లనే అమలు చేయాలంటూ దరఖాస్తులు చేసుకుంటున్నారు. వికలత్వపు పర్సంటేజీ పునః పరిశీలనలో వచ్చేశాతం బట్టి లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటాం.

-డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

తేనెలొలుకు భాష తెలుగు

● పాఠ్యపుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మధుసూదన్‌రావు, షంషుద్దీన్, సుబ్రహ్మణ్యం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తేనెలొలుకు భాష తెలుగు భాష అని పాఠ్యపుస్తకాల ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని యూటీఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో పాఠ్యపుస్తక ప్రచురణల రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు నాంది పలికారని, వాడుక భాష రాత భాషగా ఉండాలని పరితపించిన మహానుభావుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు అన్నారు. కడప, అన్నమయ్య జిల్లాల డీఈఓలు డాక్టర్ షేక్ షంషుద్దీన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం మాటాడుతూ మాతృభాష మాధుర్యం ఎనలేనిదని, ఉగ్గుపాలతో నేర్చుకున్న భాష ఎంతో ఉన్నతమైందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మహేష్‌బాబు, నరసింహరావు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



ఆందోళన చేస్తున్న జిల్లా సాధన సమితి సభ్యులు

రాజంపేట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ జిల్లా సాధన సమితి నాయకుడు పూల భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రారం సాయంత్రం అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద ప్రదర్శన చేసి అన్నమయ్య విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వం రాజంపేటకు తీవ్ర అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబరు 1న రాజంపేటకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని స్పష్టమైన ప్రకటన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబూబకర్, తాళ్లపాక నాయకులు అదృష్టదీపుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ ఉద్దండం సుబ్రమణ్యం, మన్నూరు నాయకులు పోకల ప్రభా కర్, న్యాయవాదులు నాసరుద్దీన్, కత్తి సుబ్బరాయుడు, టీచర్ల సంఘం నాయకులు రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు. సుమారు 4 వేల పోస్టు కార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు పంపారు. ప్రైవేటు పాఠశాలల సంఘం నాయకుడు ప్రభాకర్‌నాయుడు, వెంకటేశర్‌రెడ్డి, సుభాష్, నందకిషోర్, సుబ్బరాయుడు, చౌదరి, జేఏసీ నాయకులు లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, గుల్జార్‌బాషా, రామచంద్రరాజు, సుధాకర్, జనసేన నాయకులు అబ్బిగారి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ రాజంపేట మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి తదితరులు ఈ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆటో దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోను దొంగతనం కేసులో నిందితుని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వివరాలిలా.. కడప సిటీ ఎన్జీవో కాలనీకి చెందిన తుమ్మలూరు అనిల్ కుమార్ అనే వ్యక్తిపై గతంలో ఏడు క్రిమినల్ కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదయ్యాయి. చిన్నచౌకు పీఎస్, రైల్వేకోడూరు, తిరుపతి వెస్ట్, ఈస్ట్ పీఎస్‌లలో పలు ఆటోలు దొంగతనం చేసినట్లు కేసులు ఉన్నాయి. అలాగే చెన్నూరు పీఎస్, కడప వన్‌టౌన్ పీఎస్‌లో కూడా పలు కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. ఆ మేరకు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం చిన్నచౌకు ఇన్‌స్పెక్టరు ఓబులేసు, సబ్ ఇన్‌స్పెక్టరు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి శుక్రవారం తాడిపత్రి- తిరుపతి బైపాస్ రోడ్డులోని చలమారెడ్డిపల్లె క్రాస్‌రోడ్డు వద్ద నింది తుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

సన్‌సైడ్ విరిగిపడి ఆరుగురికి గాయాలు



జమ్మలమడుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికోట కొట్టాలపల్లెలో సన్‌సైడ్‌విరిగిపడి ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల మేరకు... శుక్రవారం సాయంత్రం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తుండగా మిద్దెపై కొందరు నిలబడి చూస్తున్నారు. ఆ సమయంలో ఉన్నట్లుండి సన్‌సైడ్ విరిగి కింద ఉన్న వారిపై పడటంతో గాయపడ్డారు. వెంటనే వారిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో వై.లక్ష్మీదేవి, పద్మావతి, వరలక్ష్మి, పూజారి లక్ష్మీదేవి, మైల గురుకుమార్, ఎం.గురివిరెడ్డితో పాటు మరి కొందరు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మేకల కాపరి మృతి

సీకేదిన్నె, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలో మద్దిమడుగు సుగాలిబిడికివద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బుక్కే నాగయ్యానాయక్ (55) మృతి చెందాడు. సుగాలిబిడికి చెందిన బుక్కే నాగయ్యానాయక్, ఓబుళమ్మ భార్యాభర్తలు మేకలు మేపుకుని జీవిస్తుండేవారు. శుక్రవారం మేకలను మేపుకునేందుకు గువ్వల చెరువు ఘాట్‌పైకి వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి తోలుకుని వస్తుండగా బిడికి సమీపంలో కడపవైపు నుంచి రాయచోటివైపు వెళ్లే ట్రాన్స్‌పోర్టు లారీ ఢీకొనడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు వారిని గుర్తించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా నాగయ్యానాయక్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఓబులమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారి బంధువులు తెలిపారు. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కలసపాడు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దమూర్తిపల్లె వద్ద శుక్రవారం సాయంత్రం పొలం నుంచి ఇంటికి వెళ్తున్న మహిళ మెడలోని సరడును గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లాడు. గ్రామానికి చెందిన వి.మల్లేశ్వరి కలసపాడు-పోరుమామిళ్ల ప్రధాన రహదారిలోని తనపొలం వద్ద పనులు చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటన స్థలాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ పరిశీలించి మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువు రానివారికి చదువు నేర్పించండి

● వయోజన విద్యా డీడీ వెంకటసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ డీడీ వెంకటసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చదువురానివారికి చదువు నేర్పిస్తే.. వారికి మీరు ఎప్పటికీ గుర్తుండిపోతారని వయోజన విద్యాశాఖ డీడీ వెంకటసుబ్బారెడ్డి వలంటీర్లకు సూచించారు. జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో శుక్రవారం ఉదయం ఉల్లాస్- అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వయోజన విద్యాశాఖ, మెప్మా ఆధ్వర్యంలో రీసోర్స్ పర్సన్లు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చదువు చాలా అవసరమన్నారు. ముఖ్యంగా మహిళలకు చదువు ఉంటే ఎదుటివారితో గౌరవంతో మాట్లాడమే కాక ధైర్యంతో పనులు విజయవంతంగా చేసుకువస్తారన్నారు. అనంతరం చదువు నేర్పించిన వలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందిస్తారన్నారు. సూపర్‌వైజర్ మహేశ్వర్‌రెడ్డి, మెప్మా అధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వీఏవోలకు, సీసీలకు, ఉపాధి హామీ పథకంలోని టీఏ, పీఏలకు, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 18 నుంచి 59 సంవత్సరాలలోపు చదువురాని స్త్రీ, పురుషులకు వలంటీర్లు చదువు నేర్పిస్తారని.. ప్రతిరోజు సాయంత్రం రోజు ఒక గంట చొప్పున చదువు నేర్చుకోవాలని వయోజన విద్యా డీడీ వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీవో శివారెడ్డి సూచించారు. ఏపీఎం గురుకుమార్, ఉపాధి హామీ ఏపీవో పద్మారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, సునీత పాల్గొన్నారు.

కన్నుల పండువగా ఆరోగ్యమాత తిరునాళ్ల పతాకావిష్కరణ



మేరీమాత విగ్రహాన్ని ఊరేగిస్తున్న క్రైస్తవ విశ్వాసులు

కడప కల్చరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నగర రైల్వేస్టేషన్ సమీపంలో గల ఆరోగ్యమాత తిరునాళ్ల మహోత్సవాల పతాకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప పీఠాధిపతి సగినాల పాల్ ప్రకాష్ హాజరై పతాకావిష్కరణ గావించారు.

కార్యక్ర మానికి పెద్ద సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం మేరీమాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఊరేగింపు నిర్వహించారు. తదుపరి శాంతి కోసం శాంతి కపోతాన్ని (పావురం) ఎగురవేశారు. అనంతరం దివ్య పూజా సమర్పించారు. తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరగాలని, ప్రజలందరూ శాంతి సమాధానాలతో వుండాలని ప్రార్థించారు.

దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు

కాశినాయన ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అక్కంపేట గ్రామంలో మురుకూటి పెంచల్‌రెడ్డిపై దాడికి పాల్పడిన ఐదుగురిపై శుక్రవారం కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ యోగేంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు... పెంచల్‌రెడ్డి తన సొంత పొలంలో సేద్యం చేసుకునేందుకు వెళుతుండగా అదేగ్రామానికి చెందిన మురుకూటి వెంకటసుబ్బారెడ్డి, చిన్నసుబ్బిరెడ్డి, రామాంజలి, నాగవేణి సుబ్బారెడ్డి తల్లి సీతమ్మ కలిసి అడ్డుకోవడంతో పాటు పెంచల్‌రెడ్డిని అసభ్య పద జాలంతో దూషించి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

నేటి నుంచి కడపలో సౌత్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 30వ తేదీ శనివారం నుంచి ఏసీఏ సౌత్‌జోన్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసా ద్ తెలిపారు. ఇందులో కర్నూలు, నెల్లూరు, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల క్రికెట్ జట్ల మధ్య క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు- నెల్లూరు జట్ల మధ్య, కేవోఆర్ఎం మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు, కేవోఆర్ఎం మైదానంలో అనంత పురం- నెల్లూరు జట్ల మధ్య పోటీలు వుంటాయన్నారు. సెప్టెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు, కేవోఆర్ ఎం మైదానంలో కడప-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుతాయన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు-నెల్లూరు, కేవోఆర్ఎం మైదానంలో అనంతపురం-కర్నూలు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-కడప, కేవోఆర్ఎం మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్డి ప్రసాద్ తెలిపారు.

'ఈ పోస్ మిషన్ల ద్వారా ఎరువులు విక్రయించాలి'

కడప రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు ప్రభుత్వం ద్వారా సరఫరా చేస్తున్న అన్ని రకాల ఎరువులను ఈ పోస్ మిషన్ల ద్వారా క్రయ, విక్రయాలను తప్పనిసరిగా జరపాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ పేర్కొన్నా రు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ సమావేశ కార్యాలయంలో రైతు సేవా సిబ్బందికి ఈ పోస్ మిషన్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని... ఇక నుంచి ఈ పాస్ మిషన్ల ద్వారానే క్రయ విక్రయాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు వ్యవసాయశాఖ అధికారులు, రైతు సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా శశిభూషణ్‌రెడ్డి

కడప మారుతీనగర్, ఆగస్టు 29 (ఆంధ్ర జ్యోతి): భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికారప్రతినిధిగా వంగళ శశిభూషణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆ మేరకు శశిభూషణ్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీ.ఎన్. మాధవ్ ఎంపిక చేశారు. ఆ మేరకు విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శశిభూషణ్‌రెడ్డికి మాధవ్ స్వీటు తినిపించి ఆనందం పంచుకున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

వినాయకుని ఊరేగింపులో ఉద్రిక్తత... 144 సెక్షన్ అమలు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసుసిబ్బంది

చెన్నూరు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో గురువారం రాత్రి వినాయకుడి ఊరేగింపు సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తు న్నారు. వివరాలిలా... చెన్నూరు మండల కేంద్రంలో పలు వీధుల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా స్థానిక తూర్పు హరిజనవాడలో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి.. గురువారం రాత్రి ఊరేగింపు చేపపట్టగా.. అదే ప్రాంతంలోని కొందరు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాలు మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. ఈ విషయాన్ని స్థానిక సీఐ కడప డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లడంతో ఐదుగురు సీఐలు, పలువురు ఎస్‌ఐలు పెద్దఎత్తున పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు చెన్నూరు పాత బస్టాండు కూడలిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందు జాగ్రత్తగా పరిస్థి తిని అదుపులో ఉంచేందుకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తూర్పు వీధిలోకి ముగ్గురికి మించి వెళ్లకుండా పోలీసు సిబ్బంది బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే తూర్పు హరిజనవాడ నుంచి బస్టాండు వరకు ఎవరినీ వెళ్లనీయ కుండా ఆంక్షలు విధించారు. ఈ సందర్భంగా చెన్నూరులో వినాయకుని అన్న ప్రసాదం జరిగే ప్రాంతానికి తమను ఎందకు వెళ్లనివ్వడం లేదంటూ తూర్పు హరిజనవాడ ప్రజలు స్థానిక సీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రాత్రి ఊరేగింపు సందర్భంగా గొడవకు కారణమైన షబ్బీర్, అష్రఫ్, వారిష్, ఫక్రుద్దీన్, షఫి, తన్వీర్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని.. ఎవరైనా గొడవలకు పాల్పడితే సహించేది లేదని.. కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సీఐలు రామక్రిష్ణ, సుబ్బారావు, రోషన్‌తో పాటు పలువురు ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామ సమీపంలో తాగిన మత్తులో కారు అద్దాలు ధ్వంసం చేసిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విష్ణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం నల్లపురెడ్డిపల్లెలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఊరేగింపు జరుగుతోంది. ఈ సమయంలో ప్రొద్దుటూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన వీరభద్రయ్య అనే వ్యక్తి మరో ఇద్దరితో కలిసి పావగడకు వెళ్తున్నారు. నల్లపురెడ్డిపల్లె గ్రామాన్ని దాటుకోగానే ఇద్దరు యువకులు బైకుపై వచ్చి కారును ఢీకొట్టారు. దీంతో కారు డ్రైవర్ ప్రశ్నించగా ఇద్దరు యువకులు గొడవపడి మరికొందరికి ఫోన్ చేసి రప్పించుకుని కారుపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో కారులో ఉన్నవారు భయపడి దిగి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై ఆరు గురితో పాటు మరి కొందరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా చేయాలి

అశ్లీల నృత్యాలు చేస్తే చర్యలు

డివిజన్‌లో 1604 ప్రతిమలు : డీఎస్పీ మహేంద్ర

ములకలచెరువు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాల సందర్భంగా అశ్లీల నృత్యాలు చేయడం, పొలిటికల్ పాటలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. ములకలచెరువులో వినాయక మండపాలను పరిశీలించిన ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిమజ్జనం ప్రశాంతంగా చేసుకోవాలన్నారు. మదనపల్లె డివిజన్‌లో 1604 ప్రతిమలు ఏర్పాటు చేశారన్నారు. ములకలచెరువు సర్కిల్ పరిధిలో 504 ప్రతిమలు ఏర్పాటు చేయగా 297 ప్రతిమల నిమజ్జనం పూర్తయిందన్నారు.

కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశాం


స్వామి చెరువులో చేస్తున్న ఏర్పాట్లు

మదనపల్లె, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ అన్నారు. తట్టివారిపల్లె చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, మండల పరిధిలో 350 నుంచి 400 వరకు ప్రతిమలు ఏర్పాటు చేశారన్నారు. పట్టణంలో నిమజ్జనానికి తట్టివారిపల్లె చెరువు, బసినికొండ బైపాస్‌లోని వీపీఆర్ కన్వెన్షన్ వెనుకవైపు ఉన్న స్వామి చెరువు, అరేబియా హోటల్ పక్కనున్న చెరువులను ఎంపిక చేశామన్నారు. తట్టివారిపల్లె చెరువులో పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వీలుగా లైటింగ్, బారికేడ్లు, క్రేన్‌లను ఉంచామన్నారు. తట్టివారిపల్లె చెరువుకు ప్రతిమలు తీసుకొచ్చే వారు సీటీఎం రోడ్డు, దేవతానగర్ మీదుగా సచివాలయం వెనుక వైపున ఏర్పాటు చేసిన బ్యారికేడ్లు, క్రేన్ వద్దకు రావాలన్నారు. నిమజ్జనం చేసిన తరువాత బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లాలన్నారు. నిమజ్జనంకు సంబంధించి పోలీసులు ఇచ్చిన రూట్ మ్యాప్‌ను ఖచ్చితంగా పాటించాలన్నారు.

మహాగణపతింభజే

పీలేరు, మదనపల్లెల్లో కొలువు దీరిన వెరైటీ వినాయకులు! ● మండపాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు, అన్నదానం


పీలేరు ఇందిరా నగర్‌లో గజేంద్ర మోక్ష గణపతి

పీలేరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): 'మహాగణపతిం మనసా స్మరామి మహాగణ పతిం వసిష్ఠ వామదేవాది వందిత మహాదేవ సుతం గురుగుహ నుతం మార కోటి ప్రకాశం శాంతం మహాకావ్య నాటకాది ప్రియం మూషిక వాహన మోదక ప్రియం' అంటూ భక్తులు విఘ్ననాయకుడికి పిండివంటలు, మోదకాలు సమర్పించారు. రెండో రోజు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. వివరాల్లోకెళితే....

వినాయక చవితి సందర్భంగా పట్టణంలోని పలు సెంటర్లలో వెరైటీ వినాయకులు కొలువు దీరారు. స్థానిక యల్లమంద క్రాసులోని పంచముఖ వినాయక స్వామి సెంటర్‌లో వినాయకుడిని సూర్యభగవానుడి అవతారంలో కొలువు దీర్చారు. సప్త అశ్వాల మీద ఆశీనుడైన సూర్య భగవానుడి తరహాలో ఆసెంటర్‌లోని వినాయకుడు భక్తులకు కనువిందు కలిగిస్తున్నాడు. మదనపల్లె మార్గంలోని ఇందిరా నగర్‌లో గజేంద్ర మోక్షం తరహాలో వినాయకుడిని తయారు చేశారు. మొసలి నోటికి చిక్కిన గజేంద్రుడిని త్రిశూలంతో కాపాడిన విష్ణుమూర్తిని తలపిస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నాడు విఘ్ననాథుడు. బలిజ వీధిలో వేంకటేశ్వర స్వామి తరహాలో కొలువు దీరిన వినాయకుడు భక్తులకు అభయ హస్తంతో దర్శనమిస్తున్నాడు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని మండపాల్లోని వినాయకులకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. వివిధ ఆకృతుల్లో కొలువు దీరిన విఘ్న నాథులను ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.


పీలేరు యల్లమంద క్రాసులో సప్తాశ్వరూఢుడైన గణపతి

మదనపల్లెలో ప్రత్యేక పూజలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చవితి వేడుకల్లో భాగంగా స్వామివారికి రెండోరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్వారీవీధిలో నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించి వినాయకుడికి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రెడ్డీస్ కాలనీలో గణపతిని నిర్వాహకులు ప్రత్యేక పూలతో అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంచిపెట్టారు. సప్తగిరి నగర్‌లో కుమార్ మేస్త్రీ ఆధ్వర్యంలో వినాయుడికి విశేషంగా పూజలు నిర్వహించారు. స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం నెల్లూరు ఉట్లోత్సవం జరిగింది, ఇందులో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు ఆదివారం స్వామివారిని నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మంజునాథరెడ్డి, అబి, సుధీర్, చింటూ, హర్ష, రాజు, గౌరీశంకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.


పీలేరు బలిజ వీధిలో వేంకటేశ్వర గణపతి

అమృత భాష తెలుగు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తెలుగు కవుల చిత్రపటాల ప్రదర్శన



మదనపల్లె మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు కవుల చిత్రపటాలతో అధ్యాపకులు - కురబలకోటలో విద్యార్థుల మానవహారం

మదనపల్లె టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): దేశ భాషలందు తెలుగు లెస్స అన్నారు పెద్దలు. అలాంటి తెలుగు భాషకు మద్దతుగా ఉద్యమ స్ఫూర్తి తీసుకొచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులును ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగుభాష పుట్టుక, వ్యవహారికం, తెలుగు ఆవశ్యకత గురించి వివరించారు. గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యశేఖర్‌రెడ్డి, ప్రముఖ రచయిత టీఎస్‌ఏ కృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు జ్యోతి, వనజ, విష్ణుప్రియ, మోహన్‌బాబు, ఖాజావలి, గురుమూర్తి, శైలజ, చెన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్లో హెచ్‌ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం, ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయుల చిత్రపటాలను ప్రదర్శించారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో సాగాలి

కురబలకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎంఈఓ ద్వారకనాథ్ పేర్కొన్నారు. అంగళ్లు, కురబలకోట, ముదివేడు తదితర గ్రామాల్లో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయక్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. అనంతరం వ్యాసరచన, క్రీడాపోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీడీ రమేష్, అధ్యాపకులు గురప్ప, మోహన్, నటేశ్వర్‌రావు, ప్రసాద్, వీరభద్ర, బాలకృష్ణారెడ్డి, ప్రతిమ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తేనెలొలుకు తెలుగు భాష

పెద్దమండ్యం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): తేనెలొలుకు భాష మన తెలుగు భాష అని ఎంఈఓ మనోహర్ పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని మండలంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. పెద్దమండ్యం, యల్లంవారిపల్లి, కలిచెర్ల, వెలిగల్లు, మోడల్ స్కూల్ తెలుగు భాషా దినోత్సవం ప్రత్యేక సమావేశాలు జరిగాయి. ప్రిన్సిపాల్ రామాంజులునాయుడు, కలిచెర్ల హెచ్‌ఎం మీనా నాగలక్ష్మీ, తెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బూర్లపల్లె జడ్పీహైస్కూల్‌లో...

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బూర్లపల్లె జడ్పీహైస్కూల్‌లో మాతృభాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు చేసుకున్నారు. పీటీఎం ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్ తెలుగుభాష ఔన్నత్యం, మనుగడ గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో కలిసి 116 మంది తెలుగు కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. విద్యార్థినీ, విద్యార్థులు నన్నయ్య, తిక్కన, డాక్టర్ సి నారాయణరెడ్డి శ్రీరంగం శ్రీనివాసరావు, ఎర్రాప్రెగడ, మొదలైన కవుల జీవిత చరిత్ర గురించి విద్యార్థులకు వివరించారు.

భాషా సంస్కృతిని కీర్తిద్దాం

పీలేరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష సంస్కృతిని కీర్తిద్దామని విశ్రాంత తెలుగు అధ్యాపకుడు విద్వాన్ బిక్కిపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలో తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ప్రేమరాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు జయంతిని ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవం చేసుకుంటున్నామన్నారు. తెలుగు భాష అమృత భాష అని చాటి చెప్పిన యుగవైతాళికులని ప్రశంసించారు. విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సరస్వతి శ్రీరామ రాజు, తెలుగు భాషా సమితి అధ్యక్షుడు జలకనూరి మురళీధర్‌రాజుభాషా సమితి అధ్యక్షుడు జే. మురళీధర్ రాజు, కవులు, ఉపాధ్యాయులు దా మోదర్ రాజు, నరసింహులు, నాగవేణి, యర్రయ్య, రమణ, రమణారెడ్డి, భారతి, బాలాజీ నాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

బైబై గణేశా

వేడుకగా వినాయక నిమజ్జనం

బాణసంచా పేలుళ్లతో ఊరేగింపు

ఆకట్టుకున్న వేషధారణలు



గుర్రంకొండ, నిమ్మనపల్లిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు

గుర్రంకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం శుక్రవారం పట్టణ, గ్రామీణ ప్రజలు ఘనంగా చేసుకున్నారు. చవితి వేడుక సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు ఉదయాన్నే ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం చెక్కభజనలు, కోలాటాలు, బళ్లారిడ్రమ్స్, బాణసంచా పేల్చుతూ పట్టణంలో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న వేషధారణలు

కలికిరి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోనూ పలు గ్రామాల్లోనూ ప్రతిమలను సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. కలికిరి పరిసరాల్లో నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను సీఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.

కోలాహలంగా నిమజ్జనం

నిమ్మనపల్లి ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక ప్రతిమలను కోలాహలంగా బాజాభజంత్రీల మధ్య కమిటీ సభ్యులు నిమజ్జనానికి తరలించారు. మంగళవీధి, కందూరు రోడ్డు, పాత బస్‌స్టాండులో వెలసిన వినాయక ప్రతిమలను బళ్లారిడ్రమ్స్, బాజా భజంత్రీల మధ్య వీధుల్లో జై గణేష్ అంటే నినాదాలు చేసి ఊరేగించి నిమజ్జనానికి సమీప చెరువులకు తరలించారు.

పీటీఎంలో బళ్లారి డ్రమ్ములతో..

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా చవితి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా పూజలందుకున్న స్వామి వారిని బళ్లారి డ్రమ్ములతో యువత కేరింతలు కొడుతూ నిమజ్జనం చేశారు. యువకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పీటీఎంలో పలు చోట్ల నిమజ్జనం చేశారు. పురవీధుల్లో ఊరేగింపుగా గణనాథులు నిమజ్జనానికి తరలించారు. అన్నదానం చేశారు.

తిరుమలరెడ్డిపల్లెలో వేడుకగా...

రామసముద్రం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గణనాథుల నిమజ్జనం జరిగాయి. తిరుమలరెడ్డిపల్లెలో వైభవంగా వినాయక నిమజ్జనం జరిగింది. మేళతాళాల నడుమ పురవీధుల్లో గణేష్ ప్రతిమను ఊరేగిస్తూ యువతీ, యువకులు రంగులు చల్లుకుని కోలాహలంగా నిమజ్జనం చేశారు. ఊలపాడులో పదికిలోల గణేష్ లడ్డూ వేలం, వేయగా అదే గ్రామానికి చెందిన సిద్దెగౌని రాజశేఖర్‌రెడ్డి, పన్నెండు వేలకు లడ్డూ దక్కించుకున్నాడు. ఆర్.నడింపల్లెలో గణేష్ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు.



కలికిరి వీధుల్లో ఆకట్టుకున్న వేషధారణలు - నిమజ్జనానికి తరలుతున్న గణేశ్ ప్రతిమలు

నీటి సంరక్షణ పనులు పూర్తి చేయండి


రైతులతో మాట్లాడుతున్న వాటర్ షెడ్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, అధికారులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతుల భాగస్వామ్యంతోనే నీటి సంరక్షణ పనులను పూర్తి చేయాలని వాటర్ షెడ్ చైర్మన్ సుబ్రహ్మణ్యం, వాటర్ షెడ్ అధికారులు పేర్కొన్నారు. సం పతికోట వాటర్ షెడ్ ప్రాజెక్టు పరిధిలోని రంగసముద్రం సచివాలయంలో వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యం అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమన్వయంతో పనులు చేసుకుంటే రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. రంగసముద్రం పరిధిలో ఇప్పటి వరకు 55 పనులను పూర్తి చేశామన్నారు. ఇంకా గ్రామానికి 1.80 కోట్లు వాటర్ షెడ్ నిధులు ఉన్నాయని రైతులు డిసెంబరులోగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను రైతులు సమన్వయంతో చిన్న ఊటకుంటలు, పెద్ద ఊటకుంటలు, చెక్ డ్యాంలు, డకౌట్ ఫారంపాండ్‌లు, చేసుకుంటే రైతుల బోర్లు, చెరువుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. సమావేశంలో వాటర్ షెడ్ జేఈ పవన్‌కుమార్, టెక్నికల్ ఆఫీసర్ (టీఓ) వెంకట్రమణ, (ఐసీబీ) మేఘనాథంతో పాటు రైతులు నాగార్జున, గంగిరెడ్డి, నారాయణస్వామి, లక్ష్మీనరుసు, బాస్కర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు చురుగ్గా ఏర్పాట్లు

పీలేరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నేడు జరగనున్న సూపర్ సిక్స్ పథకాల విజయోత్సవ సభ కోసం ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు జరగనున్న విజయోత్సవ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు, నందమూరి, నల్లారి కుటుంబ అభిమానులు, ప్రజలు హాజరు కానున్నారు. సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు సత్య పర్యవేక్షణలో పీలేరు నేతలు చేస్తున్నారు. సభకు సుమారు 5 వేల మంది వచ్చే అవకాశం ఉందని, వారంతా ప్రశాంతంగా కూర్చోవడానికి కుర్చీలు, సభ అనంతరం భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణాన్ని అర్బన్ సీఐ యుగంధర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లె శ్రీనాథరెడ్డి, మల్లెల రెడ్డిబాషా, అమరనాథరెడ్డి, పసుపులేటి లక్ష్మీకర, పఠాన్ మౌలా, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


టీడీపీ నేతలకు సూచనలు ఇస్తున్న పీలేరు అర్బన్ సీఐ యుగంధర్

బిరా బిరా కృష్ణమ్మ పరుగులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): చెప్పిందే చేసి చూపడమే సీఎం చంద్రబాబు నైజం ఇది నిరూపించడానికే శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను హంద్రీ నీవా ప్రాజెక్టు ద్వారా నేడు కుప్పంకు కృష్ణమ్మను బిరా బిరా పరుగులెత్తిస్తున్నారు. కర్నూల్ జిల్లా నుంచి అనంతపురం, సత్య సాయి జిల్లాల మీదుగా అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలను దాటుకున్న కృష్ణా జలాలు చిత్తూరు జిల్లాలోని పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల మీదుగా కుప్పం చేరుకున్నాయి. శుక్రవారం మదనపల్లె మండలంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాష ఆధ్వర్యంలో కొత్తపల్లె నుంచి వెళుతున్న హంద్రీనీవా జలాలకు గ్రామస్తులతో కలిసి జలహారతులు అందించి, చీర సారెను కృష్ణమ్మకు సమర్పించారు. టీడీపీ నేతలు విద్యాసాగర్, ఎంపీటీసీ దేవేంద్ర, తాళ్ల హిమగిరి, సిమెంట్ రమణ, రైల్‌మిల్ శశి, జోళపాలెం చిన్ని పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి బంగారు పతకం


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయినులు

వాల్మీకిపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అరణి వసుధ బంగారు పతకం సొంతం చేసుకుంది. ఏప్రిల్‌లో దత్త పీఠం నిర్వహించిన శ్రీమద్భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఉత్తమ శ్రేణిలో బంగారు పతకం అందుకుని ప్రశంసలు పొందింది. ఈ నెల 24న శారదా పీఠం శృంగేరి ఆధ్వర్యంలో నిర్వహించిన గీతా జ్ఞాన యజ్ఞ పరీక్షల్లో ఉత్తమ శ్రేణిలో రూ.21వేలు నగదు బహుమతి, ప్రమాణ పత్రం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి ఉత్తమ ఉపాధ్యాయురాలు వసుధను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి కూడా తప్పనిసరిగా భగద్గీత తప్పనిసరిగా నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

హంద్రీ-నీవా నీటిని చెరువులకు తరలించాలి

బి.కొత్తకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా నుంచి అన్నమయ్య జిల్లాలోని పీటీఎం, బి.కొత్తకోట, కురబలకోట మీదుగా హంద్రీ-నీవా కాల్వ ద్వారా తరలిపోతున్న కృష్ణాజలాలతో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అనుసంధాన చెరువులను నింపాలని బి.కొత్తకోట బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో చెరువులను నింపడం ద్వారా నియోజకవర్గ రైతాంగాన్ని అన్ని విధాలా ఆదున్నట్లు అవుతుందని వినతి పత్రాన్ని తహసీల్దార్ బావాజాన్‌కు అందజేశారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ

ములకలచెరువు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలను శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. కడప విజిలెన్స్ సీఐ నారాయణప్ప, వ్యవసాయశాఖాధికారి స్రవంతి తనిఖీ చేపట్టి రికార్డులు, యూరియా నిల్వలను పరిశీలించారు. రైతులకు అవసమైన యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రైవేటు డీలర్లు కూడా రైతుల కోసం యూరియాను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

పెద్దమండ్యం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ, పెద్దమండ్యం మండల ప్రత్యేకాధికారి దామోదర్‌రెడ్డి సూచించారు. మండలంలో ఆయన పర్యటించారు. కోటగుట్టపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఎస్ఓ, ఎంఈఓ మనోహర్ విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వర్షకాలంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు సుబ్రమణ్యం, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వేడుకగా జాతీయ క్రీడాదినోత్సవం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం మదనపల్లె జినరాజ దాస హాకీ మైదానంలో నిర్వహించినట్లు ఆర్గనైజర్స్ తెలిపారు. ఇందులో 4 బాలుర, 4 బాలికల జట్లు లీగ్‌లో పాల్గొని ప్రతిభను చాటాయి. జిల్లా హాకీ అధ్యక్షుడు ప్రసాద్, హాకీ క్రీడాకారుడు మనోహర్ నాయుడు, హరి, జలజ, నరేష్, హితేశ్ పాల్గొన్నారు. మార్వారి సుబ్బారెడ్డి మెమోరియల్ బాడ్మింటన్ టోర్నమెంట్ 2025ను రెడ్డీస్ కాలనీలోని ఎస్వ్యూవీ స్పోర్ట్స్ అరేనా, క్రీడాభారతి ఆధ్వర్యంలో బిగినర్స్ అండర్ 11, 14, అడ్వాన్స్ అండర్ 17,19 కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ప్రతి కేటగిరిలో సింగిల్స్, డబుల్స్ నిర్వహించి ట్రోఫీలు నగదు బహుమతి విజేతలకు ఎస్వ్యూవీ డైరెక్టర్ సుదర్శన్, క్రీడాభారతి జిల్లా కార్యదర్శి నరేశ్‌బాబు అందించారు. కార్యక్రమంలో బాడ్మింటన్ కోచ్ మహేంద్రనాయక్, మేనేజ్మెంట్ ఉదయ్, విక్కి, చరణ్, అపర్ణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులు

నవోదయ విద్యాలయ సమితి దేశ వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపినట్లు నవోదయ ప్రిన్సిపాల్ గీత అన్నారు. రీజినల్ స్థాయిలో జరిగే పోటీలు, నేషనల్ స్థాయి పోటీలకు పంపిస్తారు. నేషనల్ స్థాయిలో విజేతలను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించే పోటీలకు అర్హత సాధిస్తారు. మదనపల్లెలో జవహర్ నవోదయ విద్యార్థులు 90 మంది క్లస్టర్ స్థాయి విభిన్న క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. 78 మంది విద్యార్థులు విజయం సాధించి రీజనల్ స్థాయిలో క్రీడల్లో పాల్గొన్నారు. రీజనల్ పోటీల్లో విజేతలు ఆరుగురు జాతీయ క్రీడలకు ఎన్నికై నవోదయ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

బి.కొత్తకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): రంగసముద్రం రోడ్డు, పీటీఎం రోడ్డు, బెంగళూరు రోడ్డులలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమల నిమజ్జనం వైభవంగా జరిగింది. బళ్లారి డ్రమ్ముల వాయిద్యాల నడుమ యువకులు చిందులు వేస్తూ, రంగులు చల్లుకుంటూ పురవీధుల్లో ప్రతిమలను ఊరేగించారు. అంతకు మునుపు లడ్డూ వేలం, తీర్థ ప్రసాదాల వినియోగం చేశారు. అనంతరం గుమ్మసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి

పెద్దమండ్యం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడకారులు క్రీడాస్ఫూర్తితో మెలగాలని ఎంఈఓ మనోహర్, రామకృష్ణ పిలుపు నిచ్చారు. మండలంలో జాతీయ క్రీడాదినోత్సవం శుక్రవారం జరిగింది. పెద్దమండ్యం, కలిచెర్ల, యల్లంవారిపల్లి, వెలిగల్లు ఉన్నత పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవం జరిగింది. కలిచెర్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడటూ ముఖ్యమేనని తెలిపారు. హెచ్‌ఎంలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు విజయసారథి

కలకడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వేణుగోపాల స్వామి ఆలయంలో అర్చకుడు త్రికూటం విజయసారథి ఆధ్వర్యంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. దాతలు అన్నదానం వితరణ చేశారు.